సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

హైదరాబాద్
శనివారం 14.03.2026

@mudranews mudratv

సంపుటి: 13 సంచిక: 142
పేజీలు: 12 వెల: రూ. 5


## ఆందోళన వద్దు.. ఆత్మవిశ్వాసంతో సిద్ధమవ్వండి!

### నేటి నుంచి తెలంగాణ టెన్త్ బోర్డు పరీక్షలు




- మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు
- 2,676 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- సమయానికి కేంద్రానికి చేరుకోవాలి
- ఉదయం 9.35 తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదు
- సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లకు కఠిన నిషేధం
- ఓఎంఆర్ షీట్ నింపడంలో జాగ్రత్త అవసరం
- పరీక్షల షెడ్యూల్ ప్రకటించిన విద్యాశాఖ
- విద్యార్థులకు కీలక సూచనలు

ముద్ర డెస్క్ :

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలకు రంగం సిద్ధమైంది. శనివారం, మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు, ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసింది.

**పరీక్షా కేంద్రాల్లో పహారా.. ఆంక్షల అమలు**

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయి పారదర్శకతను పాటించేందుకు ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే, కాపీయింగ్ రహితంగా పరీక్షలు నిర్వహించేందుకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్లతో పాటు సిట్టింగ్ స్క్వాడ్లను కూడా రంగంలోకి దించారు. ఉన్నతాధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నారు. ..మిగతా 2లో




# రేవంత్ త్రిశూల వ్యూహం

- గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలపై మాస్టర్ ప్లాన్
- గ్రేటర్ కార్పొరేషన్లలో పట్టు కోసం ప్రయత్నాలు
- మూడు కార్పొరేషన్లకు విడి విడిగా ఎన్నికలపై ప్రభుత్వ ఆలోచన

- ఫలితాలను బట్టి తదుపరి వ్యూహాలు అమలు చేయాలని కాంగ్రెస్ ప్లాన్
- జీహెచ్ఎంసీ విభజన తర్వాత ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ
- వార్డుల పునర్విభజనతో రాజకీయ సమీకరణాల్లో మార్పులు
- బలమైన ఓటు బ్యాంకులను విభజించాలనే ప్రభుత్వ వ్యూహం
- మల్కాజ్‌గిరి వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్ బలహీనతలపై ఆందోళన
- సెటిలర్ల ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం
- సైబరాబాద్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో ఓటర్ల ఆకర్షణ ప్రయత్నం
- 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణతో ఎన్నికల సన్నాహాలు
- విడివిడి ఎన్నికలతో మేయర్ పీఠాలపై పట్టు సాధించాలన్న లెక్కలు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలపై రేవంత్ టీం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన ప్రభుత్వం.. వాటికి ఎన్నికలు మాత్రం ఒకే సారి పెట్టాలనుకోవడం లేదు. విడివిడిగా ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. గ్రేటర్ ఫలితాలను బట్టి ఒక్కో చోట తమ రాజకీయ వ్యూహాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

**కొత్తగా విభజన.. అదే స్థాయిలో ఎన్నికల వ్యూహాలు**

హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం ..మిగతా 2లో



## ఆర్టీసీలో సమ్మె సైరన్

### ఈ నెల 26 నుంచి సమ్మెకు సిద్ధమవుతోన్న కార్మికులు

- రెండు వారాల్లో పరిష్కరించాలని అల్టిమేటం
- ప్రభుత్వంలో సంస్థ విలీనం, ఫిట్ మెంట్ అమలు ప్రధాన డిమాండ్లు
- ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, పనిభారం తగ్గింపు కోసం పట్టు
- సంస్థ యాజమాన్యానికి జేఏసీ నేతల నోటీసులు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

లంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్లను తీర్చాలంటూ ఆర్టీసీ జేఏసీ నేతలు రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఫిట్‌మెంట్, ప్రభుత్వంలో విలీనం, పెండింగ్ బకాయిలు, ఆంక్షలు ఎత్తివేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్నకు, ..మిగతా 2లో




## పోలీస్ శాఖలో 17 వేల ఉద్యోగాల భర్తీ..

10

- రాష్ట్రస్థాయికి ఎస్సై పోస్టులు
- సర్వీస్ రూల్స్‌లో సవరణలు
- భర్తీకి ప్రభుత్వానికి ఫైలు
- త్వరలోనే ఆమోదం



## ఆసరా ఆశలపై నీళ్లు

- కొత్తవి రావు... పాతవి పెరగవు....
- ఆసరా కోసం ఎదురుచూపులు...
- 25 లక్షల దరఖాస్తులు పెండింగ్..
- రెండేళ్లలో.. 2 లక్షల పెన్షన్లు రద్దు...
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తు దారులు..
- పట్టించుకోని అధికారులు...

9



## దోపిడి ఉన్నంత కాలం మావోయిజం ఉంటుంది

9

- ఆపరేషన్ కగార్ మా ముందు చిన్న విషయం
- గెరిల్లా ఎత్తుగడుల ముందు ఏదీ పని చేయదు
- పార్టీ తప్పుడు నిర్ణయాలతోనే ఈ పరిస్థితి
- ప్రాణాలకు భయపడి మేం పోలీసులకు లొంగిపోలేదు
- కగార్ కు ముందు అనేక ఆపరేషన్లలో అడవిలో ఉన్నాం
- మా కార్యకర్తలను సమన్వయం చేసుకునేందుకు బయటికి వస్తే అరెస్ట్ చేశారు
- దోపిడి ఉన్నంత కాలం మావోయిజం ఉంటుంది
- హిడ్మాది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్
- 2023 తర్వాత గణపతిని చూడలేదు
- మావోయిస్ట్ మాజీ అగ్రనేతలు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి

## కాంగ్రెస్ అవకాశవాద రాజకీయం

- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అనుకూలంగా మలుచుకుంది
- దానం కాంగ్రెస్ బీఫాంపై ఎంపీగా పోటీ చేసినా స్పీకర్ కు తెలియదట
- దానంకు క్లీన్ చిట్ ను సమర్థిస్తారా..? చర్యలకు ఆదేశిస్తారా..?
- రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

3

## అభివృద్ధి పేరుతో దోపిడీ

- కేఎల్ఎస్ ఆర్ ఇన్‌ఫ్రాటెక్ వ్యవహారంపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయాలన్న కేటీఆర్
- సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీకి భారీ కాంట్రాక్టులు ఇచ్చారని ఆరోపణ
- రాష్ట్రంలో పోలీసులు, విచారణ సంస్థలపై ప్రజలకు నమ్మకం లేదని విమర్శ
- సాక్ష్యాధారాలు తారుమారు చేశారని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- అమిత్ షా, నిర్మల సీతారామన్ సహా పలువురు కేంద్ర మంత్రులకు లేఖలు

3



## దయచేసి.. మూసీ పునరుద్ధరణను అడ్డుకోకండి: సీఎం రేవంత్ రెడ్డి

- మూసీకి కొత్త జీవం.. నగరానికి సువర్ణ భవిష్యత్తు
- 36 నెలల్లో 'మూసీ' ప్రక్షాళన.. తొలి దశకు రూ. 7 వేల కోట్లు
- గండిపేట నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేర సుందరీకరణ
- 365 రోజులు నిండుగా గోదావరి జలాలు.. కొత్తగా 14 వంతెనలు, 3 బ్యారేజీలు

2

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యం
- మంత్రి శ్రీధర్ బాబు

10





## ప్రగతి పథంలో పేదల సంక్షేమం

- ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రైతులకు బోనస్‌తో ప్రభుత్వం అండ
- ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి
- పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగుతోందన్న మంత్రి
- రూ.29.92 కోట్ల అభివృద్ధి పనులు బీరోలు గ్రామానికి మంజూరు
- రంజాన్ తోఫా పంపిణీ, ముంపు బాధితులకు గృహాల పత్రాలు అందజేత

9

## గ్యాస్ సరఫరాపై హైలెవల్ కమిటీ

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్
- జిల్లా కలెక్టర్లు ప్రతి రోజు గ్యాస్ సరఫరాపై సమీక్షించాల్సిందే
- గ్యాస్ సరఫరాపై ప్రజలు పుకార్లు నమ్మొద్దు
- బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు
- అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి
- గృహ వినియోగదారులతో పాటు ఆస్పత్రులు, విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత
- కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్ల వీడియో కాన్ఫరెన్స్

9





## చరిత్రను నిర్మించిన కన్నీటి పొర.. కమాటిపురా

### ముంబైలో తెలుగువారి ఆత్మబంధువు 'కమాటిపురా'కు వీడ్కోలు!"

### కనుమరుగు కానున్న ముంబై తెలుగువారి తొలి చిరునామా

ముంబై నడిబొడ్డున తెలుగు జాతి ఆత్మగౌరవానికి నిలువుటద్దంలా నిలిచిన 'కమాటిపురా'.. ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోయే సమయం ఆసన్నమైంది. ఇటుక ఇటుకలో మనవారి చెమట, కన్నీరు దాచుకున్న ఈ చారిత్రక ప్రాంతం, ఇప్పుడు అభివృద్ధి ముసుగులో తన ఉనికిని కోల్పోతోంది. నిన్నటి వరకు ముంబైలో తెలుగువారి అస్తిత్వానికి చిరునామాగా వెలుగొందిన కమాటిపురా, నేడు పేరు మార్పుతో కనుమరుగవుతున్న అనాథలా మిగిలిపోయింది. ఇది కేవలం ఒక ప్రాంతం అంతం మాత్రమే కాదు... దేశ ఆర్థిక రాజధానిలో తెలుగువారి మూలాలు కరిగిపోతున్న విషాదగాథ.

2

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## టాప్ 10 ఏసీ చిట్కాలు

గది పరిమాణానికి సరిపోయే ఏసీ ఎంచుకోండి
చిన్న గదులకు విండో ఏసీ సరిపోతుంది. పెద్ద గదులకు స్ప్లిట్ ఏసీ మంచిది.

## ఆందోళన వద్దు.. ఆత్మవిశ్వాసంతో సిద్ధమవ్వండి!

**ద్యార్థులకు విద్యాశాఖ సూచనలు**

పరీక్షా సమయంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని విద్యాశాఖ స్పష్టం చేసింది:

**సమయపాలన:**
పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది. విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. కాబట్టి, సమయానికి 30 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవడం శ్రేయస్కరం. చివరి నిమిషంలో పరిగెత్తడం వల్ల కలిగే ఆందోళన పరీక్షపై ప్రభావం చూపుతుంది.

**ముందస్తు పరిశీలన:**
పరీక్షా కేంద్రం ఎక్కడుందో, అక్కడికి వెళ్లే మార్గాన్ని ముందుగానే చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి.
నిషిద్ధ వస్తువులు: ఎగ్జామ్ సెంటర్ లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు. కేవలం హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, ఎగ్జామ్ ప్యాడ్ మాత్రమే తీసుకెళ్లాలి.
ఓఎంఆర్ షీట్ జాగ్రత్త: గత ఏడాదే ప్రారంభించిన ఓఎంఆర్ షీట్ విధానం ఈసారి కూడా కొనసాగుతుంది. ఆన్సర్ బుక్‌లెట్‌కు జతచేయబడిన ఓఎంఆర్ షీట్‌ను ఎలా నింపాలో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి. దీనిపై వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నమూనా వీడియోలను చూడాలని సూచించారు.

**పరీక్షల షెడ్యూల్ (క్లుప్తంగా):**
మార్చి 14: ఫస్ట్ లాంగ్వేజ్
మార్చి 18: సెకండ్ లాంగ్వేజ్
మార్చి 23: థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్)
మార్చి 28: మ్యాథమెటిక్స్
ఏప్రిల్ 02: ఫిజికల్ సైన్స్
ఏప్రిల్ 07: బయోలాజికల్ సైన్స్
ఏప్రిల్ 13: సోషల్ స్టడీస్
ఏప్రిల్ 15 & 16: వొకేషనల్ కోర్సులు మరియు ఓఎస్ఎస్‌సీ పేపర్లు.

ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలు రాయాలని, తమ కష్టానికి తగిన ప్రతిఫలం అందుతుందని విద్యాశాఖ ఆకాంక్షించింది. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్!




# రేవంత్ 'త్రిశూలాల' వ్యూహం

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లుగా చెబుతున్నారు.

**రాజకీయ వార్డుల పునర్విభజన..?**

ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాలనుకుంటున్నారు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది నిర్ణయించేలా చేయాలనుకుంటున్నారు.

**కాంగ్రెస్ బలహీనతలే వ్యూహాలకు మూలమా?**

మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇంకా పటిష్టమైన యంత్రాంగం సిద్ధం కాలేదు. అక్కడ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికీ బలంగా ఉండటం అధికార పార్టీకి కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒకేసారి ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అనుకూలమైన చోట ముందుగా, ప్రతికూలత ఉన్న చోట నిదానంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా నష్ట నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**సైబరాబాద్ సెటిలర్ల ఓట్లు - గెలుపు గుర్రం ఎవరిది?**

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి చోట్ల ఆంధ్ర మూలాలున్న ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఈ ప్రాంతాల్లో గెలుపు ఏ పార్టీకైనా ప్రతిష్టాత్మకమే. అందుకే, తక్షణమే ఎన్నికలకు వెళ్లకుండా, అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక అభివృద్ధి పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సైబరాబాద్ పరిధిలో మౌలిక వసతుల కల్పన ద్వారా వారి విశ్వాసాన్ని పొందాకే ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను ప్రకటించారు. ఈ స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆపై భారీ స్థాయిలో ప్రారంభోత్సవాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఒకవైపు పాలనను వికేంద్రీకరిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులతో ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టాలనేది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోంది.

**విడివిడి ఎన్నికల వెనుక అసలు లెక్కలు**

మూడు కార్పొరేషన్లకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరపడం ద్వారా.. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితం లేదా ప్రభావాన్ని మరో ప్రాంతంలో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు, అధికార యంత్రాంగాన్ని ఒకే చోట కేంద్రీకరించి గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భాగ్యనగర త్రిశూల వ్యూహంతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎంత మేర వర్కవుట్ అవుతాయన్నది వేచి చూడాల్సిందే.

## దయచేసి మూసీ పునరుద్ధరణను అడ్డుకోకండి: సీఎం రేవంత్ రెడ్డి

- **మూసీకి కొత్త జీవం.. నగరానికి సువర్ణ భవిష్యత్తు**
- **36 నెలల్లో మూసీ ప్రక్షాళనకు లక్ష్యం**
- **తొలి దశకు రూ.7 వేల కోట్లు**
- **గండిపేట–బాపూఘాట్ వరకు 21 కిమీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి**
- **గోదావరి జలాలతో ఏడాది పొడవునా ప్రవాహం**
- **కొత్తగా వంతెనలు, బ్యారేజీల నిర్మాణం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ మహానగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మూసీ నది పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు మూసీ నది ప్రక్షాళన అత్యంత కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడకుండా సహకరించాలని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఆయన విజ్ఞప్తి చేశారు.

"అభివృద్ధి చేస్తే నాకు ఏమీ రాదు. ఏం చేసినా చివరికి ఇక్కడే వదిలి వెళ్లాలి. కానీ నేను చేసిన మంచి పనులు గుర్తుండాలి" అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు ఎవరి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికో, ఎవరికి వ్యతిరేకంగానో కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే మూసీ నది పునరుజ్జీవనం తప్పనిసరి అని ఆయన అన్నారు.

నగరంలో గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీ నదిని ఐదు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో గండిపేట నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పరిధిలో రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైందని అధికారులు తెలిపారు. ఈ దశకు సుమారు రూ.7 వేల కోట్లు ఖర్చు అవుతుందని, మొత్తం పనులను 36 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మూసీ రివర్ రిజువెనేషన్ పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈ. వెంకట నర్సింహారెడ్డి ప్రాజెక్టు వివరాలను వివరించారు.మూసీ నదిలో ఏడాది పొడవునా నీటి ప్రవాహం కొనసాగించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. జలమండలికి కేటాయించిన 20 టీఎంసీల గోదావరి జలాల్లో 2.5 టీఎంసీలను మూసీ పునరుద్ధరణ కోసం వినియోగించనున్నారు. దీంతో మూసీలో ఎప్పటికప్పుడు నీరు ప్రవహించే పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా 9 వంతెనలు నిర్మించనున్నారు. ఇప్పటికే ఉన్న 5 వంతెనలను పునరుద్ధరించనున్నారు. అదనంగా నది ప్రవాహాన్ని నియంత్రించేందుకు 3 బ్యారేజీలు కూడా నిర్మించనున్నారు. మూసీ నది వెంట ఉన్న బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించడంతో పాటు ప్రస్తుతం మూసీలో కలుస్తున్న 27 ప్రధాన నాలాల నుంచి వచ్చే మురుగు నీటిని ముందుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసి తరువాతే నదిలోకి వదిలేలా చర్యలు చేపట్టనున్నారు.ప్రాజెక్టు పూర్తయితే మూసీ నది కేవలం నీటి ప్రవాహ మార్గంగా కాకుండా పర్యాటక, పర్యావరణ, వినోద కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో మూసీ పునరుద్ధరణ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.



## పాత్రికేయ రంగానికి శ్రీనివాస్ రెడ్డి సేవలు అభినందనీయం

**ముద్ర న్యూస్ బ్యూరో :**

హైదరాబాద్: మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ గా రెండవసారి నియమితులైన కే శ్రీనివాస్ రెడ్డికి 'ఫారెస్ట్ నేషన్' రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరత్ నల్లమోతు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. హైటెక్ సిటీ లోని ఫారెస్ట్ నేషన్ కార్పొరేట్ కార్యాలయంలో శ్రీనివాస్ రెడ్డి గౌరవార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శరత్ ఆయనను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి జీవిత విశేషాలు, పాత్రికేయ వృత్తిలో అందుకున్న పదవులు, సత్కారాల గురించి రూపొందించిన ఏవీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడానికి విశేషంగా కృషి చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి రెండవసారి మీడియా అకాడమీ చైర్మన్ పదవి దక్కడం సముచితమని అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజే యూ )స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కే సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే ) అధ్యక్షులు కే విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, మధు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి కిరణ్, సిహెచ్ శ్రీనివాసరావు, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ( హెచ్ యూజే) అధ్యక్షుడు ఎస్ శంకర్ గౌడ్ ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, రాష్ట్ర చిన్న, మధ్య తరహా పత్రికలు, మ్యాగజైన్ల అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కే ఎన్ హరి, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్ హరీష్, మెట్రో టీవీ ఎండీ కొండవీటి జయప్రసాద్, ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఆజం ఖాన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టీసీలో సమ్మె సైరన్

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వం మరియు సంస్థ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చింది. రెండు వారాల్లోగా తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఈ మేరకు జేఏసీ నాయకులు ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్నకు, కార్మిక శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. మొత్తం 31 డిమాండ్లతో నోటీసు ఇచ్చినట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలని, 2017 పీఆర్సీ ప్రకారం పెండింగ్ వేతనాలను చెల్లించాలని, అలాగే 2021 పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇక ఆర్టీసీ ఉద్యోగులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం, విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడం, పెండింగ్ డీఏలను చెల్లించడం వంటి అంశాలను కూడా జేఏసీ ప్రస్తావించింది. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కూడా కోరారు.అదే సమయంలో ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ నేతలు పేర్కొన్నారు. కార్మికులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బస్సు చక్రాలు ఆగిపోవచ్చని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే సమ్మెకు మద్దతుగా ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద దీక్ష చేపట్టేందుకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే చర్చలకు రావాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు.

# చరిత్రను నిర్మించిన కన్నీటి పొర.. కమాటిపురా

**కమాటిపురా..!**
**కడుపు నింపుకోవడానికి**
**కడుపు కింది అవయవమ్మీద**
**పాలకులే రాజముద్ర వేసిన**
**ప్రేమాటిపురా..!**

ఒకప్పటి ముంబై తెలుగువారి వైభవోపేతమైన చరిత్రకు సాక్ష్యం పలికిన కమాటిపురా త్వరలోనే కనుమరుగు కానుంది. తన ఆనవాళ్ళనే కాకుండా, తన పేరును కూడా కాలగర్భంలో పోగొట్టుకోనుంది. మొదట్లో కమాటిపురా అంటే ఇప్పటిలాగా ఒక తిట్టుకాదు..ఒక అద్వితీయమైన తెలుగువారి చరిత్ర..! ఎందరో మహానుభావుల అడ్డా..! ముంబై సామాజిక గమనాన్ని మార్చిన ఉద్యమాల నెలవు..శతాబ్దాల క్రితం కొలాబాలోని చేపల మార్కెట్ వద్ద స్థిరపడ్డ తెలుగు ప్రజలు ఆ చేపల వాసన భరించలేక అనారోగ్యం పాలై, ప్రభుత్వ చేయూతతో స్థలాంతరం చెంది, ఉప్పు పొలాల్లోకి మారి, తెలుగు వాడలు నిర్మించుకున్న స్థలం పేరే కమాటిపురా..! ప్రణాళిక బద్దంగా, అందంగా, చూడచక్కని వీధులతో, ఏడు మందిరాలతో, సామాజిక సంస్థలతో తెలుగువారు ముచ్చటపడి నిర్మించుకున్న ఆ ప్రదేశమే కమాటిపురా.! మహాత్మ జ్యోతిరావు పులే, డా॥బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి మహనీయుల్ని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకున్న తెలుగువారు నివసించిన ప్రదేశమే కమాటిపురా..! ఎన్నో ఉద్యమాలు జరిగిన ప్రాంతం.. ఎందరో నాయకులు, పారిశ్రామికవేత్తలు,భవన నిర్మాతలు ఉద్భవించిన చోటు.. ముంబైలో కమాటిపురాను ప్రస్తావించకుండా తెలుగువారి చరిత్ర పూర్తికాదు. జాతి విద్వేషులు కొందరు, ఉత్తర భారతీయ ఆధిపత్య, అక్రమ వలసదారులు కొందరు తమ అజ్ఞానంతో, మూర్ఖత్వంతో, గౌరవప్రదంగా ఉచ్చరించాల్సిన 'కమాటిపురా' ను అవమాన ప్రదమైన పదబంధంగా మార్చేశారు.. అప్పట్లో 'కామ్','మట్టి'... 'మట్టి కా కామ్' చేసే మన తెలుగువాళ్ళు ఉండే ప్రాంతం గనుక అది 'కామ్‌మట్టి పురా' అంటే 'కమాటిపురా' గా అయింది. ఆ కాలంలో విదేశీ పాలకులు బ్రిటిష్ అధికారులతో పరిపాలన సాగించేవారు. సంవత్సరాల తరబడి ముంబైలో ఉండడం వల్లఆ విదేశీ అధికారుల కామకోరికల్ని తీర్చేందుకు ప్రభుత్వమే కమాటిపురాను ఆనుకొని ఉన్న ప్రాంతంలో కొందరు వేశ్యల్ని అధికారికంగా నియమించింది. అప్పట్లో ఆ రోడ్‌ను ఫాక్‌లండ్ రోడ్ / పారస్‌రోడ్ అని పిలిచేవారు. నిజానికి ఆ రోడ్ కమాటిపురాను ఆనుకొని మాత్రమే ఉంది. కానీ, రానూరానూ కమాటిపురా ప్రాంతం మొత్తాన్ని రెడ్‌లైట్ ఏరియా గా వహరించసాగారు. ముంబైలో రెడ్‌లైట్ ఏరియా అంటే కమాటిపురా అనేంతగా దుష్ప్రచారం పొందింది. కానీ, తెలుగువారు ఏర్పాటు చేసుకున్న కమాటిపుర గల్లీలు (లేన్‌లు) రెడ్ లైట్ ఏరియాలు కావు. కమాటిపురాలో తెలుగు వారికి చెందిన సొంత భవనాలెన్నో ఉన్నాయి. రోడ్లకి తెలుగువారి పేర్లున్నాయి. మందిరాలుతెలుగువారివే..! తెలుగువారికి చెందిన అతిపెద్ద సంస్థలు, మున్నూర్‌వార్ జ్ఞాతి గంగ, అఖిల పద్మశాలి సమాజం లాంటివి ఇక్కడే ఉన్నాయి. తెలుగు పుస్తకాలయాలు, తెలుగు దుకాణాలు ఇక్కడ సర్వసాధారణం..

కాలం మారింది.. మారుతోంది.. కొన్నేండ్ల క్రితం కమాటిపురా అభివృద్ధి పేరుతో కొందరిని భవనాలు ఖాళీ చేయించి సయాన్ ప్రతీక్షా నగర్ లోని ట్రాన్సిట్ క్యాంప్‌లకు తరలించారు. దశాబ్దాల తర్వాత కూడా వారు తిరిగి కమాటిపురాకు చేరుకోలేదు. తెలుగువారి స్థానాన్ని గుజరాతీలు, మార్వాడీలు, ముస్లింలు ఆక్రమించారు.ఇప్పుడు మళ్ళీ కమాటిపురాను పూర్తిగా కూల్చేసి టవర్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.అయితే, ఇప్పుడు కేవలం కమాటిపురా గల్లీల్లోని భవనాలను కూల్చడమే కాకుండా, కమాటిపురా అనే పేరునే మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొన్నేండ్ల తర్వాత అక్కడ కమాటిపురా ఉండదు. ఆ ప్రాంతానికి మరో కొత్తపేరు రానుంది. ఏం పేరు పెడతారో ఇంకా నిర్ధారణ కాకపోయినా కొత్త పేరు పెట్టాలనే నిర్ణయం మాత్రం జరిగిపోయింది.కమాటిపురాలో తెలుగువారి సంఖ్య ఇప్పటికే బాగా తగ్గింది. అయినప్పటికీ కమాటిపురా అంటే తెలుగు కేంద్రం అనే పేరుంది. కొన్ని రోజుల తర్వాత ఇహ ఆ పేరుండదు. తెలుగువారి తొలి చిరునామా అయిన కమాటిపురా తన రూపాన్నే కాదు.. పేరును కూడా మార్చుకోబోతుంది. పరిణామ క్రమంలో జరగబోయే ఈ అభివృద్ధికి సంతోషించాలో, తెలుగువారి మూలాలు పెకిలిపోతున్నందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితి..! వ్యవస్థలన్నీ మార్కెటింగ్ ఆధారంగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో కమాటిపురా అనే పేరుకోసం ఉద్యమించే అవకాశాలు కూడా లేవు. కోట్ల రూపాయలు పెట్టి కట్టే టవర్‌లను కమాటిపురా పేరుతో అమ్ముకోవడం వ్యవస్థలకు సాధ్యం కాదు. అందుకే ఈ పేరు మార్పు సంకల్పం. కానీ, తెలుగు అభిమానులకు మాత్రం శరాఘాతం.. తప్పదు.. భరించాల్సిందే..!!



**- సంగెవేని రవీంద్ర**
**9987145310**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 ఏసీ చిట్కాలు**

చిట్కాలు ఇన్వర్టర్ టెక్నాలజీ ఉన్న ఏసీకి ప్రాధాన్యం ఇవ్వండి ట్విన్ రోటరీ ఇన్వర్టర్ ఏసీలు తక్కువ శబ్దంతో పనిచేసి విద్యుత్‌ను ఆదా చేస్తాయి.



# కాంగ్రెస్ అవకాశవాద రాజకీయం

- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అనుకూలంగా మలుచుకుంది
- దానం కాంగ్రెస్ బీఫాంపై ఎంపీగా పోటీ చేసినా స్పీకర్ కు తెలియదట
- దానంకు క్లీన్ చిట్ ను సమర్థిస్తారా..? చర్యలకు ఆదేశిస్తారా..?
- రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కాంగ్రెస్ నేతలు అవకాశవాదం కోసం వాడుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్ అధికారికంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఇచ్చిన బీ ఫాంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. ఇది ఊహాగానమో, వదంతో కాదన్న ఆయన ప్రజా రికార్డుల్లో ఉన్న నిజం అన్నారు. అయినా దానం పార్టీ మారారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని శాసనసభ స్పీకర్ చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీ బీ ఫాంపై ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ద్రోహానికి ఆధారం కాకపోతే, పదో షెడ్యూల్ ప్రకారం ద్రోహానికి ఆధారం అంటే అర్థం ఏంటో దేశం మొత్తం తెలుసుకోవాల్సిన ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడే విధానం? దేశానికి మీరు బోధించే రాజ్యాంగ నైతికత ఇదేనా? అని నిలదీశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సమర్థిస్తారా? లేక చర్యలకు ఆదేశిస్తారా? అని మాజీ మంత్రి హరీశ్ రావు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాహుల్ గాంధీకి ఆయన లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి.. రాజ్యాంగాన్ని చేతబట్టి దేశవ్యాప్తంగా నీతి సూత్రాలు చెప్పిన మీరు కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం మరోలా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షించడం అంటే ఇదేనా? రాజ్యాంగ నైతికత ఇదేనా అని ప్రశ్నించారు. ఒక పార్టీ టికెట్‌పై ఎన్నికైన ఎమ్మెల్యే, మరో పార్టీ జెండా కింద ఎన్నికల్లో పోటీ చేసి కూడా ఎమ్మెల్యేగా కొనసాగితే రాజ్యాంగ ఆత్మ కేవలం రాజకీయ నినాదంగా మారిపోతుందన్నారు. ఢిల్లీలో రాజ్యాంగాన్ని కాపాడుతున్నామని చెప్పి, తెలంగాణలో దాన్ని బలహీనపరచడం ఎలా సమర్థించగలరు? అని నిలదీశారు. దీంతో విప్ మార్పిడి చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం, స్పీకర్‌కు మీరు సూచిస్తారా? లేకపోతే, కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడటం రాజకీయ ప్రయోజనం ఉన్నప్పుడేనా అని దేశం భావించాలో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు, అలాగే దేశ ప్రజలు నిజాయితీగల సమాధానాన్ని ఆశిస్తున్నారని రాజ్యాంగాన్ని కేవలం ప్రసంగాలతో కాపాడలేమన్నారు.



## గ్యాస్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలి

- అక్రమంగా నిల్వచేసిన 41 గ్యాస్ సిలిండర్లు సీజ్
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

**ముద్ర ప్రతినిధి, కోదాడ:** విశ్వసనీయ సమాచారం మేరకు సూర్యాపేట పట్టణ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సూర్యాపేట పట్టణం పిఎస్ఆర్ సెంటర్ వద్ద ఒక షాపులో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వచేసిన 41 సిలిండర్ లు గుర్తించి సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఇందులో 21 గృహ ఉపయోగకరమైనవి, 20 వాణిజ్యపరమైనవి ఉన్నాయని అన్నారు. దీనికి సంబంధించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే గ్యాస్ సిలిండర్లను అక్రమ మార్గంలో అమ్మిన, అక్రమంగా నిలువచేసిన, కృత్రిమ కొరత సృష్టించిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ ఉపయోగకరమైన గ్యాస్ సిలిండర్లను వాణిజ్యపరంగా అమ్మకూడదని సూచించారు. ప్రజల అవసరాలకు సరిపడా గ్యాస్ సిలిండర్ నిలువలు అందుబాటులో ఉన్నాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం సంబంధిత ఏజెన్సీలు గ్రామాలలో, పట్టణాలలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను సకాలంలో అందిస్తాయని అన్నారు. ప్రజలు ఆందోళన చెంది గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరవద్దని, గ్యాస్ టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించవద్దని కోరారు. గ్యాస్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా నకిలీ వ్యక్తులు గ్యాస్ ను బుక్ చేసినట్లయితే అలాంటి వారిని గుర్తించాలని కోరారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు బాధ్యతగా ఉండాలని కోరారు. గ్యాస్ అమ్మకాల కు సంబంధించి పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.




## బీఎన్ఆర్ ఇన్ఫ్రా, ఎలైట్ ఇన్ఫ్రా ఆస్తులు జప్తు

- రూ. 35.05కోట్ల మోసాలకు పాల్పడ్డట్టు ఈడీ వెల్లడి
- ఎస్ బీ ఐకి రూ. 8.20 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ. 26.86 కోట్ల నష్టం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నకిలీ పత్రాలతో బ్యాంక్ రుణాలు పొంది మోసాలకు పాల్పడిన బీఎన్ఆర్ ఇన్ఫ్రా, ఎలైట్ ఇన్ఫ్రా సంస్థలకు ఈడీ షాకిచ్చింది. ఆ సంస్థలకు చెందిన ఆస్తులను హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఈడీ అధికారులు శుక్రవారం జప్తు చేశారు. రెండు సంస్థలు రూ. 35.05కోట్ల మోసాలకు పాల్పడ్డట్టు వెల్లడించారు. జప్తు చేసిన ఆస్తులు బీఎన్ఆర్ ఇన్ఫ్రా నిర్వహకులు బీరెడ్డి నరసింహారెడ్డి, కంఫార్ట్ సెక్యూరిటీ లిమిటెడ్ డైరక్టర్ అనిల్ బెనిప్రసాద్ అగర్వాల్‌లకు చెందినట్లుగా తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి సుమారు రూ.8.20 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ.26.86 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఈడి అధికారులు వెల్లడించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా చూపెట్టడం, వివాదాస్పద భూములను బ్యాంక్ గ్యారెంటిలుగా సమర్పించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఎస్‌బీఐ నుంచి రూ.1 కోటి విలువైన 'బ్యాంక్ గ్యారెంటీ'ని పొందే ఉద్దేశంతో, నిందితులకు కంఫర్ట్ సెక్యూరిటి లిమిటెడ్ ( డైరెక్టర్ అనిల్ బెనిప్రసాద్ అగర్వాల్)కు మధ్య నకిలీ ఒప్పందం సృష్టించి మోసాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మోసపూరితంగా పొందిన రుణాలను దారి మళ్ళించి ఇతర ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు.

## రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్రంగూడ

- పర్యావరణ, అటవీశాఖ అధికారిక ఉత్తర్వులు
- అక్కడ మరో భారీ అర్బన్ పార్క్ ఏర్పాటుకు కసరత్తు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీశాఖ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మరో భారీ అర్బన్ పార్క్ ఏర్పాటుకు అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. మొత్తం 424.31 ఎకరాల అటవీ భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర శివార్లలోని అటవీ భూములను సంరక్షిస్తూ, వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ అర్బన్ పార్కులు 'గ్రీన్ లంగ్స్' (పచ్చని ఊపిరితిత్తులు)గా పనిచేస్తాయి. గతంలో గండిపేట, కోత్వాలగూడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కులకు వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు నిర్మించబోయే పార్కులో మరిన్ని అత్యాధునిక వసతులు, బయో-డైవర్సిటీ పాయింట్లు ఉండేలా అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సర్వే, ఫెన్సింగ్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

# అసెంబ్లీని ముట్టడిస్తాం

- ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో విద్యారంగం నిర్వీర్యం
- రాష్ట్ర బడ్జెట్ లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి
- సమస్యలను పరిష్కరించాలి
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. విద్యార్థుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం సిగ్గు చేటు అని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించడంతో పాటు విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం దౌర్భాగ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే విద్యాశాఖకు మంత్రి లేకపోవడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనమని, తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియామించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటున్న ప్రతి కార్యక్రమంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తానని, ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సరైన మౌళిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. కొఠారీ కమిషన్ నివేదిక ప్రకారం 30 శాతం నిధులు కేటాయిస్తే రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందుతుందని చెప్పినా, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదని తెలిపారు. ఇటీవల విద్యాశాఖ కమిషన్ సమర్పించిన నివేదికను బహిర్గతం చేసి, అందులోని అంశాలపై విద్యావేత్తలతో చర్చలు జరపాలని, నివేదికలో సూచించినట్లు ప్రతి మండల కేంద్రానికి 5 నుంచి 6 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్(టిపిఎస్)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రేయింబర్సుమెంట్, స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలనీ వారు డిమాండ్ చేసారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకాన్ని సంఘటితం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించడం తో పాటు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, నాయకులూ హరీష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారుల వేధింపులతో మహిళ ఆత్మహత్య

**ముద్ర, తాండూరు :** వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టుకోలేక ఓ మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. తాండూరు మండలం సిరిగిరిపెటకు చెందిన లక్ష్మి అప్పుల బాధకు ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం తన భార్య లక్ష్మి స్థానికంగా ఉండే హనుమంత్ రెడ్డి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. పంటలు పండకపోవడంతో గడువులోగా డబ్బు చెల్లించలేకపోయారు. సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా వినకుండా, ఊరిలో అందరూ చూస్తుండగానే అసభ్య పదజాలంతో దూషించి, సూటిపోటి మాటలతో తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేసాడు. నిందితులు చేసిన అవమానాన్ని భరించలేక లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై, తన వల్ల కుటుంబానికి అవమానం జరిగిందన్న బాధతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిందని తెలిపారు. పొలం అమ్మి అయినా మీ బాకీ తీరుస్తామని చెప్పాం, కానీ వారు కనికరం లేకుండా మాట్లాడారు. ఇప్పుడు నా పిల్లలు తల్లి లేని అనాథలయ్యారు అని మృతురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై స్థానిక పోలీస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పేరుతో దోపిడీ

- కేఎల్ఎస్ ఆర్ ఇన్‌ఫ్రాటెక్ వ్యవహారంపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీకి భారీ కాంట్రాక్టులు
- రాష్ట్రంలో పోలీసులు, విచారణ సంస్థలపై ప్రజలకు నమ్మకం లేదు
- సాక్ష్యాధారాలు తారుమారు చేశారు
- అమిత్ షా, నిర్మల సీతారామన్ సహా పలువురు కేంద్ర మంత్రులకు కేటీఆర్ లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కొనసాగుతోన్న విచారణ సంస్థలు, పోలీసు అధికారులను నమ్మే పరిస్థితి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో దిగజారిన పరిస్థితులను గాడిలో తీసుకురావాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను.. కేటీఆర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర తాజా పరిస్థితులను వివరిస్తూ శుక్రవారం హోంశాఖ మంత్రికి లేఖ రాశారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ పైన నమోదైన కేసులు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సేకరించిన సాక్ష్యాధారాలు పోయాయి అని ప్రభుత్వ అధికారులు కోర్టులో చెప్పడం దారుణమన్నారు. సీఎం తన బినామీ కంపెనీ కోసమే అధికారుల పైన ఒత్తిడి తీసుకువచ్చి సాక్ష్యాధారాలను మాయం చేయించారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్న కేటీఆర్.. పోలీస్ వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం పోయిందని ఆరోపించారు. కేఎల్ఎస్ ఆర్ కంపెనీ దివాలా తీసిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయిస్తున్నారనీ అందుకే ఆ సంస్థ పై ఉన్న విచారణను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కేఎల్ఆర్ఆర్ కంపెనీ పైన ఉన్న ఆర్థిక పరమైన ఆరోపణలు, కేసులపైన పక్షపాతం లేకుండా, ఒత్తిడి లేకుండా నిష్పాక్షిక విచారణ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికే దివాలా ప్రక్రియ కొనసాగుతున్న కంపెనీ కోసం రేవంత్ రెడ్డి రూ. 2500కుకోట్లకు పైగా భారీ కాంట్రాక్టులను కేటాయించారని చెప్పారు. సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులతో పాటు యంగ్ ఇండియా స్కూల్ ప్రాజెక్టులు, రోడ్డు నిర్మాణ పనులను అడ్డగోలుగా రేవంత్ రెడ్డి దివాలా తీసిన ఈ కంపెనీకి అప్పచెబుతున్నారని ఫిర్యాదు చేశారు. కేఎల్ఎస్ ఆర్ కంపెనీకి రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం అందరికీ తెలుసనీ కంపెనీ కోసం నేషనల్ లా ట్రిబ్యునల్ విచారణలో కూడా రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ కంపెనీ అంశంలో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు తగిన విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించిందని చెప్పారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనీ కాబట్టి వెంటనే ఈ కంపెనీ చేస్తున్న నేరాలు, ఈ కంపెనీకి ముఖ్యమంత్రి చేస్తున్న అనుచిత లబ్ది నేపథ్యంలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వంటి ఏజెన్సీలతో సంపూర్ణ దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు ఇతర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, కార్పొరేట్ గవర్నెన్స్ బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కి, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కి కూడా కేటీఆర్ లేఖలు పంపించారు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
14.03.2026 శనివారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com





మార్చి 14 ఐన్ స్టీన్ జయంతి

## ఆధునిక భౌతికశాస్త్రానికి మూలస్తంభం ఐన్ స్టీన్

"సైన్సు లేని మతం గుడ్డిది, మతం లేని సైన్సు కుంటిది" అని విజ్ఞానాన్ని, మతాన్ని సమానంగా గౌరవించిన వ్యక్తి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జర్మన్ మూలానికి చెందిన సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త. ఆధునిక భౌతిక శాస్త్రానికి మూలస్తంభమైన సాపేక్ష సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తి ఆయనే. అది అతని ద్రవ్యరాశిశక్తి సమానత్వ సూత్రం కావచ్చు లేదా ఫోటోఎలెక్ట్రిక్ ప్రభావం యొక్క చట్టం కావచ్చు, అతను ప్రతిపాదించిన సిద్ధాంతాలు సైన్స్ చరిత్రను శాశ్వతంగా మార్చాయి. 1879 మార్చి 14న జర్మనీలో జన్మించిన ఐన్ స్టీన్ కు మూడు ఏండ్ల వరకు మాటలు కూడా రాని ఇతడు ఇంతగొప్ప సైంటిస్ట్ అవుతాడని ఎవరు ఊహించిలేదు. స్విట్జర్ లాండ్ లోని జ్యూరిచ్ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పూర్తిచేశాడు. చదువుకుంటున్న రోజుల నుండే పరిశోధనలు ప్రారంభించాడు. అతను ప్రకటించిన కాంతి విద్యుత్ ఫలితం కు గాను 1921 లో నోబెల్ బహుమతి పొందిన గొప్ప మేధావి ఐన్ స్టీన్. 1907 వ సంవత్సరంలో ఒక పదార్థం నుండి వెలువడే శక్తి దాని ద్రవ్యరాశికి అనులోమానుపాతంలో ఉంటుంది అని తెలిపే E=MC2సూత్రాన్ని ప్రతిపాదించాడు. ఈ సూత్రమే హైడ్రోజన్ బాంబు తయారీకి మూలం అయ్యింది. ఇతను 1951 లో ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం విశ్వం యొక్క రహస్యాలు పూర్తిగా తెలుసుకొనుటకు ఎంతగానో ఉపయోగపడింది.ఐన్ స్టీన్ అంటే కేవలం భౌతిక శాస్త్రం మాత్రమే కాదు. ఆయన వయోలిన్ వాయిస్తాడు. పడవ కూడా నడుపుతాడు. తనకు మనసు బాలేనప్పుడు, ఏదైనా సమస్యకు పరిష్కారం దొరకనప్పుడు ఆయనీ పనులు చేస్తాడు. అలాగని ఐన్ స్టీన్ గొప్ప సెయిలర్ కాదు. కనీసం ఈత కూడా రాదు. పడవ బోల్తాకొట్టి మునిగిపోతుంటే జాలర్లు కాపాడిన సందర్భాలున్నాయి. అయినా ఎందుకు సెయిలింగ్ చేస్తాడంటే... ''సముద్రంలో విహారయాత్ర ప్రశాంతతనిస్తుంది. విభిన్న దృక్కోణాలనుండి ఆలోచించడానికి అద్భుత అవకాశాలు కల్పిస్తుంది'' అని ఆయనే చెప్పాడు.మీకు ఆసక్తిని కలిగించే ప్రశ్న ఎదురైతే సంవత్సరాల తరబడి దాన్నే పట్టుకుని ఉండండి. లోతుగా అన్వేషించండి. దానిపై పట్టు సాధించండి. అంతేతప్ప సులువుగా అందే విజయాలతో సంతృప్తి చెందకండి'' అని ఐన్ స్టీన్ కూడా ఒక లేఖలో చెప్పారు. అంతేకాదు.. ''సమస్య క్లిష్టతను చూసి కుంగిపోకూడదు. ప్రయత్నిస్తే దేన్నయినా అర్థం చేసుకోవడం కష్టమేం కాదు. కావాల్సిందల్లా పట్టువిడవని ప్రయత్నం మాత్రమే'' అని తన స్నేహితుడు డేవిడ్ బోమ్ కు రాసిన ఉత్తరంలో చెప్పాడుఐన్ స్టీన్ ఇంత గొప్ప మేధావి ఎలా అయ్యాడో తెలుసుకోవాలని అతను మరణించినప్పటికి మెదడును భద్రపరచి పరిశోధనలు సాగిస్తున్నారు.

సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747








# యుద్ధ మేఘాలు... పెరుగుతున్న చమురు ధరలు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు కీలకమైన ఇంధన వనరు. పరిశ్రమలు, రవాణా, వ్యవసాయం వంటి అనేక రంగాలు చమురు ఆధారంగా నడుస్తున్నాయి. అందువల్ల ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం లేదా రాజకీయ ఉద్రిక్తతలు ఏర్పడితే మొదట ప్రభావం చూపేది చమురు మార్కెట్‌పైనే. చరిత్రలో 1973లో జరిగిన చమురు సంక్షోభం దీనికి ప్రధాన ఉదాహరణ. అరబ్-ఇజ్రాయిల్ యుద్ధం అనంతరం అరబ్ దేశాలు అమెరికా మరియు పాశ్చాత్య దేశాలపై చమురు సరఫరా ఆంక్షలు విధించాయి. ఫలితంగా చమురు ధరలు ఒక్కసారిగా నాలుగు రెట్లు పెరిగాయి. ఆ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడింది. ఇంధన కొరత, ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం వంటి సమస్యలు అనేక దేశాలను కుదిపేశాయి.

తరువాత కూడా ఇరాన్ విప్లవం, గల్ఫ్ యుద్ధం, ఇరాక్ యుద్ధం వంటి సంఘటనల సమయంలో చమురు ధరలు భారీగా పెరిగాయి. యుద్ధాలు మరియు చమురు ధరల మధ్య ఉన్న ఈ సంబంధం ఇప్పటికీ కొనసాగుతోంది.

ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య పెరుగుతున్న విభేదాలు ప్రపంచాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ప్రాంతం ప్రపంచ చమురు నిల్వలలో పెద్ద భాగాన్ని కలిగి ఉండటం వల్ల అక్కడ యుద్ధ పరిస్థితులు తలెత్తితే చమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా హోర్ముజ్ సముద్ర మార్గం ప్రమాదంలో పడితే ప్రపంచ చమురు సరఫరాపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. చమురు ధరలు పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయి. దాంతో రవాణా ఖర్చులు పెరిగి వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలపై ఇది ప్రభావం చూపుతుంది. భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది.ఇంధన ధరల పెరుగుదలతో ప్రజల దైనందిన జీవన ఖర్చులు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల ధరలు పెరగడం వల్ల హోటల్ రంగం తీవ్రంగా ప్రభావితమవుతోంది. వ్యాపార ఖర్చులు పెరగడంతో కొందరు హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అందువల్ల చమురు సంక్షోభాలను నివారించడానికి ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాలి. సౌరశక్తి, గాలిశక్తి వంటి పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాన్ని పెంచడం అవసరం. అంతర్జాతీయ సహకారం, శాంతి చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించడం కూడా ఎంతో కీలకం.

చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే యుద్ధాలు కేవలం రాజకీయ సమస్యలు మాత్రమే కావు, అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా కుదిపేస్తాయి. అందువల్ల శాంతి, సహకారం ద్వారానే ప్రపంచం ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కోగలదు.



రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# బ్రెయిన్ ఫాగ్ తో ముంచుకొచ్చే మతిమరుపు

**కరోనా వైరస్ కాలంలో తెరపైకి వచ్చిన కొత్త వ్యాధులలో బ్రెయిన్ ఫాగ్ ఒకటి. ఇది వైద్య పదం కాదు. బదులుగా, ఇది ఒక సాధారణ భాషా పదం, దీని ద్వారా మెదడుకు సంబంధించిన అనేక సమస్యల వస్తాయి...**

గతంలో పెద్దవారు, వృద్ధుల్లోనూ ఎక్కువగా మతి మరుపు అనే లక్షణం చూసేవాళ్లం. కానీ, గత కొంత కాలంగా యువతలోనూ మతి మరుపు లేదా జ్ఞాపకశక్తి తగ్గడం అనేది ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న చిన్న విషయాలను కూడా మర్చిపోతుంటే లేదా ఏదైనా గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడుతుంటే, అది బ్రెయిన్ ఫాగ్(brainfog) కావచ్చు. అటువంటి పరిస్థితిలో, మీరు జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఏకాగ్రత పెట్టడంలో ఇబ్బంది, సమాచారాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతుంటారు. ఒత్తిడి, నిరంతర అలసట, అవాంఛిత ఆలోచనలను ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో, మీరు కూడా తరచుగా ఏదైనా మర్చిపోతుంటే..

అయితే మీరు బ్రెయిన్ ఫాగ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టే. అసలు ఈ బ్రెయిన్ ఫాగ్ అంటే ఏమిటి..? ఎందువల్ల వస్తుంది..? తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



మానసిక గందరగోళం, ఏ విషయం పైనా స్పష్టత లేకపోవడం, పనులపై దృష్టి పెట్టలేకపోవడం, విషయాలు గుర్తుంచుకోవడంలో ఇబ్బంది.. ఇలాంటి స్థితిని బ్రెయిన్ ఫాగ్ అంటారు.

**ఎవరికి వస్తుంది? :**

* బ్రెయిన్ ఫాగ్.. పాఠశాలకు వెళ్లే పిల్లల నుంచి పెద్దవారి వరకు.. అన్ని వయసుల వారినీ ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో సేమ్ లక్షణాలు ఉండొచ్చు.. వేర్వేరుగా ఉండొచ్చు.అందులో కొన్ని..
* ఏకాగ్రత తగ్గడం
* జ్ఞాపక శక్తిని కోల్పోవడం
* అస్పష్టమైన ఆలోచనలుతీవ్రమైన అలసట
* నిరుత్సాహంగా ఉండటం..

**బ్రెయిన్ ఫాగ్ కారణాలు:**

దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో కొన్నింటిని చూస్తే..డిజిటల్ పరికరాల ఉపయోగం:ప్రస్తుత కాలంలో డిజిటల్ పరికరాల వినియోగం అధికమైంది. దీంతో మెదడుకు పని చెప్పడం మానేశాం.. ఏ పని చేయాలన్నా వీటిపై ఆధారపడటం వల్ల మన ఆలోచన తీరు.. గుర్తుంచుకోగల సామర్థ్యం దెబ్బతింటుంది.

**ఒత్తిడి:**

అధిక ఒత్తిడి బ్రెయిన్ ఫాగ్‌కు ఓ కారణంగా చెప్పుకోవచ్చు. దీర్ఘకాలిక ఒత్తిడి మెదడుపై అధిక పనిభారాన్ని, పీడనాన్ని కలిగిస్తుంది. ఒత్తిడి వల్ల రక్తపోటు పెరగడం, రోగనిరోధక శక్తి బలహీనపడటం, మానసిక అలసట, పనిపై దృష్టికేంద్రీకరించలేకపోవడం, తీవ్రమైన తలనొప్పి, కుంగుబాటుకు లోనుకావడం కూడా జరగవచ్చు. ఇది మీ మెదడు సరిగా పనిచేయక, ఏకాగ్రతను కోల్పోయేలా చేస్తుంది.

**నిద్రలేమి:** ప్రస్తుత కాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య నిద్రలేమి. మారిన జీవనశైలి, ఆహారం, ఉరుకుల పరుగల జీవితం వంటివి ఈ సమస్యకు కారణాలుగా చెప్పవచ్చు. నిద్రలేమి సమస్య మెదడు పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. తక్కువ నిద్రపోవడం వల్ల ఏకాగ్రత తగ్గడంతోపాటు ఆలోచనలు మబ్బుగా మారతాయి. కాబట్టి ప్రతీరోజు రాత్రి ఎనిమిది గంటలు నిద్రపోయేందుకు ప్రయత్నించండి.


**వైద్య కారణాలు:**

ఈ సమస్యకు కొన్ని వ్యాధులను కారణాలుగా చెప్పవచ్చు. అవి రక్తహీనత, డిప్రెషన్, మధుమేహం, మైగ్రేన్లు, అల్జీమర్స్, హైపోథైరాయిడిజం, లూపస్, అలాగే కొవిడ్ 19 పరిణామాలు కూడా..

**తీసుకోవలసిన జాగ్రత్తలు..**

* మీ ఆహారంలో అమైనో ఆమ్లాలు, విటమిన్లు A, B, C, D, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను క్రమం తప్పకుండా చేర్చండి.
* మధ్యాహ్నం పూట కెఫిన్‌తో కూడిన పానీయాలు తీసుకోవద్దు.
* క్రమం తప్పకుండా వ్యాయామం..
* కంటి నిండా నిద్ర అవసరం

డా.కౌశల్ గోవర్ధన ఏం.బి.బి.ఎస్,
(ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్
శ్రీరామానుజ సేవా ట్రస్ట్, డా. ధనుంజయ హాస్పిటల్,
హైదరాబాద్



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 14.03.2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 ఏసీ చిట్కాలు**



రాగి కాయిల్ ఉన్న ఏసీ తీసుకోవడం మంచిదికాపర్ కాయిల్ వేడిని త్వరగా గ్రహిస్తుంది. లీకేజీ తక్కువగా ఉండి రిపేర్ కూడా సులభం

# ఆదర్శ మహిళా కవయిత్రి మొల్ల

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

కవయిత్రి మొల్లను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ లోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో ఉన్న మొల్ల విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొల్ల ఆదర్శ మహిళ అని, 16వ శతాబ్దంలో విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప కవయిత్రి అని అన్నారు. రామాయణం టీవీ సీరియల్ నిర్మాణ సమయంలో ప్రామాణిక గ్రంథాలుగా తీసుకున్న వాటిలో రంగనాథ రామాయణంతో పాటు మొల్ల రచించిన మొల్ల రామాయణం ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని, వచ్చే జయంతి వరకు జీఓ తీసుకువస్తమన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి ఇప్పటికే విన్నవించినట్లు తెలిపారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై మాట్లాడుతామన్నారు. మొల్ల జీవిత చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాలలో చేర్చాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ కు రిప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాలమూరు బిడ్డలకు నాణ్యమైన విద్యను అందిస్తే వారు ఉన్నతంగా ఎదగడమే కాకుండా భావితరాలకు మార్గదర్శకులవుతారన్నారు. మహబూబ్‌నగర్ యువత కోసం ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేయించామని, అలాగే మహిళల కోసం స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. అదనంగా టాస్క్ సెంటర్ ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు బుగ్గన, నియోజకవర్గం అధ్యక్షులు నాగన్న, నాయకులు శేఖరాచారి, ఆంజనేయులు, మాసయ్య, సారంగి లక్ష్మి కాంత్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు నాణ్యమైన వైద్యం**

పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతున్నదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాన్పు అయిన నవజాత శిశువుల తల్లులకు ఎమ్మెల్యే హెల్త్ కిట్లు, హెల్త్ కార్డులను అందించి మాట్లాడారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే "ఆరోగ్య మహబూబ్ నగర్"గా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసవం అనంతరం తల్లులు, శిశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన యెన్నం హెల్త్ కిట్లు, యెన్నం హెల్త్ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, కాంగ్రెస్ నాయకులు కోస్గి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

**మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం**

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం హన్వాడ మండలానికి చెందిన లబ్ధిదారులకు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపిడిఓ యశోద తదితరులు పాల్గొన్నారు.

## అంతరంలో మొల్ల జయంతి

**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని అంతారం గ్రామంలో తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి వేడుకలు తాండూర్ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అంతారం సర్పంచ్ జంగని లక్ష్మి వెంకటయ్య హాజరై మాట్లాడారు. కవయిత్రి మొల్ల కుమ్మరి కులానికి వన్నె తెచ్చిన స్త్రీమూర్తి అని కొనియాడారు. ఉపాధ్యాయులు కుమ్మరి అంజలయ్య కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డే రవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శీను, వార్డ్ సభ్యులు, తాండూర్ కుమ్మర సంఘం అధ్యక్షులు పాండు, ప్రధాన కార్యదర్శి అనంతయ్య, శంకర్, నరసింహులు, పండరి, సత్తయ్య, సాయిలు, కిష్టయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహిళా భద్రత కోసం చర్యలు అభినందనీయం

**జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్**

**ముద్ర, మల్కాజిగిరి:**




తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్ అభినందించారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర పోలీస్ శాఖ మహిళ మద్దతు కోసం చేపడుతున్న వివరాలను తెలుసుకొని ప్రశంసించారు. మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె సూచించారు. గురువారం మేడ్చల్ – మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'మహిళా జన సున్వాయి' (బహిరంగ విచారణ) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన సుమారు 35 ఫిర్యాదులను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా సమీక్షించిన చైర్‌పర్సన్, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కె. అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైదరాబాద్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాంకీ సంస్థ సహకారంతో వ్యర్థాల తరలింపు


**బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ**

**ముద్ర, బోడుప్పల్:**




గృహ నిర్మాణం, తొలగింపు వంటి కార్యక్రమాల్లో వచ్చే వ్యర్థాలను రోడ్డు పక్కన పడవేయకుండా మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని బోడుప్పల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మార్గదర్శకత్వంలో బోడుప్పల్ సర్కిల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఎ .శైలజ, డీఈఈ ( ఎస్.డబ్ల్యూ.ఎమ్ ) కె. జాహ్నవి శశాంక్ తో కలసి హాజరై మాట్లాడారు. ప్రజలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు. ఈ నెల 14, 15 తేదీలలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని వార్డులలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ( ఈ –వేస్ట్ ) సేకరిస్తునట్లు తెలిపారు. ప్రజలంతా తమ ఇళ్లు, కార్యాలయాలలో వున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ( ఈ –వేస్ట్ ) లను ప్రతి కాలనీ కి అందుబాటులో గల ఎలక్ట్రానిక్ వ్యర్థాల ( ఈ –వేస్ట్ ) సేకరణ కేంద్రంలో అందజేయాలని సూచించారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి జిల్లా ఎస్పీ జానకి ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హోంగార్డు కుమారునికి ఈ సాయం అందించారు. ఫిబ్రవరి 16 న మహిళా హోంగార్డు నాగమణి గుండెపోటుతో మరణించారు. ఆమె కుటుంబానికి తోడ్పాటు అందించాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న హోంగార్డులు కలిసి స్వచ్ఛందంగా రూ.లక్ష పోగుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు నాగమణి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆమె కుటుంబానికి భవిష్యత్తులో అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. హోంగార్డ్స్ ఇన్చార్జ్ ఆర్.ఐ. అశోక్ కుమార్, ఎంటీవో నాగేష్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, స్వామి గౌడ్, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మ్యాథ్స్ ఒలంపియాడ్ లో విద్యార్థి ప్రతిభ




**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

గణిత ఒలింపియాడ్‌లో వికారాబాద్ పట్టణానికి చెందిన వేదిక్ పాఠశాల విద్యార్థి విహాన్ రెడ్డి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. విహాన్ 3వ తరగతి చదువుతున్నాడు. ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ దేశవ్యాప్తం గా నిర్వహించిన ఈ పరీక్షలో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదిక్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ విక్రమ్ రెడ్డిమాట్లాడుతూ తమ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థి విహాన్ రెడ్డి ఈ విజయం సాధించడం గర్వకారణమన్నారు. తమ పాఠశాల మరోసారి విద్యా రంగంలో తన ప్రతిష్టను చాటుకుందన్నారు. విహాన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలి

**కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

ఏప్రిల్ 20 లోపు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మంజూరైన 12,863 ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 8,546 ఇండ్లు గ్రౌండింగ్ చేయబడ్డాయని, మంజూరైన ప్రతి ఇల్లు గ్రౌండింగ్ అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వేసవిలో నీటి కొరత లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలెత్తే గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో




జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జెడ్పీ సీఈవో సుధీర్, డీపీవో జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సురేష్, హౌసింగ్ పీడీ సయ్యద్ మొక్రం బాబా పాల్గొన్నారు.

**గ్యాస్ కొరత లేదు.. పుకార్లు నమ్మవద్దు**

రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వందతులను కూడా నమ్మవద్దని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్కు ఆసుపత్రులు, విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని తెలిపారు. గ్యాస్ బ్లాక్ మార్కెట్ చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ గ్యాస్ బ్లాక్ మార్కెట్ కాకుండా నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డీవో వాసుచంద్ర, డీసీఎస్వో సుదర్శన్, డీఎంసీఎస్ మురళీకృష్ణ, డీఎంహెచ్వో స్వర్ణ కుమారి, డీఈవో రేణుకాదేవి, డీబీసీడీవో మాధవ రెడ్డి, డీఏవో రాజారత్నం, డీడబ్లూవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

**–ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రైవేట్ కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశాయి. అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆర్టీఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు, ఎంప్లాయ్‌మెంట్ అధికారి రాఘవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రామనారావు, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

# ఆరోగ్య తాండూర్ గా మారుద్దాం

**– ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్:**



ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం 5 కె రన్ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. తమ ఆరోగ్యమే కాకుండా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. కల్తీ లేని ఆహార పదార్థాలు తీసుకోవాలని ముఖ్యంగా యువకులు శారీరకంగా దృఢంగా ఉండేందుకు మార్నింగ్ వాక్, వ్యాయామం చేయాలని తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి విలేమున్ చౌరస్తా వరకు ఉత్సాహంగా 5కె రన్నింగ్ లో ఎమ్మెల్యే పాల్గొని అందరిని ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, ఎమ్మార్వో తారా సింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

తాండూరు పట్టణంతో పాటు తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ. 2 కోట్ల 70 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు పొందే విషయంలో లబ్ధిదారులు ఎవరికీ నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా అధికారులు కానీ, మధ్యవర్తులు కానీ డబ్బులు అడిగితే స్వయంగా తనకు ఫోన్ చేయాలన్నారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## గో- వృషభ కళ్యాణం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

పట్టణ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో నిర్వహించిన గో–వృషభ కళ్యాణ మహోత్సవంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సతీమణి సరిత సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు గోపూజ నిర్వహించి, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. తదనంతరం ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేశ్, స్థానిక కౌన్సిలర్స్, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధిపై కమిషనర్ కు ఎమ్మెల్యే వినతి

**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ పనులు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజనను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. బాలనగర్ రాజు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను ఈఎస్ఐ డిస్పెన్సరీగా మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పేద ప్రజలకు ఉపయోగపడుతున్న కమ్యూనిటీ హాల్‌ను వేరే అవసరాలకు కేటాయించడాన్ని సహించబోమని, దానిని యథావిధిగా ప్రజలకే అందుబాటులో ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో 2026–2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సురేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, ఐఏఎస్ హాజరయ్యారు. మున్సిపాలిటీ బడ్జెట్ అంచనాలను సిద్ధం చేసి కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. బడ్జెట్ ప్రకారం సాధారణ ఆదాయం రూ.920.49 లక్షలుగా అంచనా వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో మహిళలదే కీలక పాత్ర

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీస్ అధికారిణుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.మహిళా పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు విద్య, వైద్యం, పరిపాలన, రక్షణ, క్రీడలు, సాంకేతికత వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది ధైర్యంగా, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ విలువైన సేవలు అందిస్తున్నారని అన్నారు. చట్టం మరియు శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. డీఎంహెచ్ఓ గీతాంజలి, వైద్య సిబ్బంది, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు ఉపేందర్ రావు, అశోక్ రెడ్డి, ఆర్ఐ జగన్, సబ్ ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్, ఘౌస్ పాషా, రాజిత, రామదేవి, లలిత పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, మల్కాజిగిరి:**

ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఆశా వర్కర్లు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో నౌరిన్ బేగం, ఉన్నికృష్ణన్, ఆశా వర్కర్లు కమల, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ముద్ర, కూకట్‌పల్లి:**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శిల్ప బృందావనంలో వెలసిన శ్రీ కోదండరామస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పల్లకి సేవలో ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 400ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

**ముద్ర, శేరిలింగంపల్లి:**

శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. మంగళవారం ఈ మేరకు ఆక్రమణలు తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగాపేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కును కాపాడిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 14.03.2026
www.mudranews.in | @mudranews



టాప్ 10 ఏసీ చిట్కాలు



4-వే స్వింగ్ ఫీచర్ ఉన్నదాన్ని ఎంపిక చేసు కోండి. ఇది గాలిని గది నలుమూలలకు సమానంగా పంపి మెరుగైన కూలింగ్ ఇస్తుంది.

# మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు**



**మహాదేవపూర్, ముద్ర:** మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని గిరిజన సంక్షేమ భవన్‌లో కుట్టు మిషన్ల శిక్షణ, స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఐదు మండలాలలో 852 మందికి కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరికి మార్కెటింగ్ సౌకర్యంతో పాటు కాటారం మండల కేంద్రంలో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు మొక్కుబడిగా పని చేయకుండా మహిళల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించి శక్తివంతులుగా మారడానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. మహాదేవపూర్ ప్రాంతంలో మహిళలకు అగరుబత్తుల తయారీకి సంబంధించిన శిక్షణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాజీవ్ యువశక్తి ద్వారా డైరీ ఉత్పత్తులపై కూడా శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమగ్ర వ్యవస్థ ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుందని చెప్పారు. ఈ సమా వేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, స్థానిక సంస్థల కలెక్టర్ విజయ లక్ష్మి , డీఆర్ డీఓ బాలకృష్ణ, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేష్, సర్పంచ్ హసీనా భాను పాల్గొన్నారు.

**కాళేశ్వరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..**

గోదావరి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈఓ కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాలు, రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్ల వెడల్పు విషయంలో గ్రామస్తులు సహకరిస్తే వారికి భవిష్యత్తులో పుణ్యక్షేత్రం అభివృద్ధి చెంది మేలు జరుగుతుందని అన్నారు. అధికారులు నిర్ణయిం చిన లక్ష్యాలను విధివిధానాలను నెరవేర్చాలన్నారు. బస్టాండ్ కు చెరువు స్థలం కేటాయించాలన్నారు. సమావేశానికి ఎస్ఈ స్థాయి అధికారులు హాజరు కాకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సంస్థ సలహాదారుడు గోవింద హరి, ఎస్పీ సంకీర్త్, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సిం గ్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్తు, పీఆర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా కేంద్రంలో శుక్రవారం రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి కవయిత్రి మొల్లమాంబ 586 వ జయంతి ఉత్సవాలను జిల్లా తెలంగాణ కుమ్మర సంఘం, కుమ్మర ఉద్యోగుల సంఘం (కేవా) సంయుక్తంగా నిర్వహించారు. మొల్ల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుమ్మర సామాజిక వర్గానికి చెందిన మొల్ల రామాయణాన్ని ఆరు కాండల్లో 871 పద్యాలతో, వ్యవహారిక భాషలో కేవలం ఐదు రోజులలో రచించారని తెలిపారు. ఆమె అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వం మొల్ల జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, కొత్తపల్లి గంగాధర్, పోతుగంటి సాయన్న, తోడిశెట్టి పరమేశ్వర్, మారుపాక శ్రీనివాస్, తోడిశెట్టి రవికాంత్, చంద్రయ్య, శంకర్, మల్లేష్, రమేష్, సాయికుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తాం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** చారిత్రక ప్రాధాన్యత ఉన్న నిర్మల్ కట్టడాలను పరిరక్షించి, పట్టణ చరిత్రను భావి తరాలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని బత్తిస్ ఘడ్, శ్యామ్ ఘడ్ లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక కట్టడాలుగా పేరున్న ఘడ్ లను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వీటి పరిసరాలను అభివృద్ధి చేస్తే నిర్మల్ వాసులు సేదదీరేందుకు అవసరమైన పార్క్ కొరత తీరుతుందని చెప్పారు. వీటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కోరినట్లు తెలిపారు. పనులు, అవసరాలపై నివేదిక తయారు చేసేందుకు హైదరాబాద్ లోని ఎస్ కె ఏజెన్సీకి అప్పజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపి, ఎస్పీ రాజు, మాజీ కౌన్సిలర్లు ధర్మాజీ శ్రీనివాస్, నల్లూరి పోశెట్టి, ఎఫ్ ఎస్ సీ ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, గుర్రం సత్యం, అడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి జన గణనపై శిక్షణ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** భారత జనగణన–2027 నిర్వహణకు సంబంధించి జిల్లాలోని అధికారులకు ఈ నెల 16న శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీఓల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

**పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..**

పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని చెప్పారు.

## పది పరీక్షలు సాఫీగా జరిగేందుకు ఏర్పాట్లు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



జిల్లలో శనివారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలు సాఫీగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లాలోని 47 పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

# గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందొద్దు

**- కలెక్టర్ అభిలాష అభినవ్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై శుక్రవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలోని స్థితిగతులను వివరించారు. జిల్లా ప్రజల అవసరాలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సరఫరా వ్యవస్థను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజల గృహ అవసరాల కోసం అవసరమైన మేరకు గ్యాస్ సిలిండర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదనపు కలెక్టర్లు వెంక టేశ్వర్లు, కిషోర్ కుమార్, సీపీఓ జీవరత్నం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఈవో భోజన్న, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ రూరల్ మండలం కౌట్ల కె లో శుక్రవారం బీజేఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.రూ.20 లక్షలతో రెండు సెల్ఫ్ హెల్ప్ బృంద భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో రెండు వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ.12 లక్షలతో అంగన్ వాడీ భవన నిర్మాణానికి, రూ. 5 లక్షలతో మాల సంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమాల్, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సారెడ్డి, గంగారెడ్డి, సర్పంచ్ రాజు, నాయకులు ముని, ముత్యం, శ్రీధర్, రమణ రెడ్డి, రాజన్నతో పాటు మండల నాయకులు, పలువురు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా కవిత జన్మదిన వేడుకలు



**ముద్ర, కరీంనగర్:** నగరంలో శుక్రవారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు రమేష్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం అందించారు. జిల్లా సీనియర్ నాయకుడు రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో కేక్ కట్ చేశారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి ఆద్వర్యంలో బీట్ వద్ద గలవృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా సీనియర్ నాయకుడు బసవేణి రాజేందర్ ఆద్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా నాయకులు గుండేటి తిరుపతి ఆద్వర్యంలో స్పందన వృద్ధుల అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ కోసం కృషి చేస్తున్న కవిత జన్మదిన వేడుకలను ప్రజల మధ్యలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో పాలక వర్గం, ప్రతిపక్షం ఒకటయ్యాయని ఆరోపించారు. జిల్లా జాగృతి నాయకులు చంటి శ్రీనివాస్, గాలిపల్లి రత్నాకర్ చారి, జంగ అపర్ణ, పిన్నింటి సంగీత రెడ్డి, గర్శకుర్తి విద్యాసాగర్, ఎండీ సల్మ, పోన్నం శిరిష, అంజలి, పుసాల పవన్, లంక మనోజ్, మహమ్మద్ హుస్సేన్, ఎండీ యాకుబ్, రంగరవేణి అకాష్, హుస్నాబాద్ రాజ్ కుమార్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తాము దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షురాలు బి. సుజాత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఆశా వర్కర్లు రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తూ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారికి తగిన వేతనాలు, సామాజిక భద్రతా సదుపాయాలు లేకపోవడం అన్యాయమన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలన్నారు. రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు రూ.1,500 పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. సర్వేలు, పోలియో కార్యక్రమాలు, ఎన్నికల విధులు వంటి పలు పనుల బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్లకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులకు రూ.50 వేల సాయం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలని కోరారు. వారానికి ఒక రోజు సెలవు, పండుగల సందర్భంగా ప్రత్యేక సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆశా వర్కర్లకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సౌమ్య, మంగ, శారద, అనురాధ, స్రవంతి, లావణ్య, అనురాధ, సుజాత, ఊర్మిళ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లలో గృహావసర సిలిండర్లు స్వాధీనం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని పలు హోటళ్లలో శుక్రవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ దేశాల మేరకు శుక్రవారం 16 హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. గృహావసరాలకు కేటా యించిన 29 సిలిండర్లను అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థి తుల్లో చట్టానికి విరుద్ధంగా గృహ అవసరాల కోసం కేటాయించిన సిలిండర్లను వ్యా పార అవసరాలకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. డొమెస్టిక్ సిలిండర్లను కమ ర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 14-03-2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 ఏసీ చిట్కాలు**

ఐఎస్ఈఈఆర్ విలువను తప్పక చూడండి ISEER విలువ ఎక్కువగా ఉంటే విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది.



## ఆర్గానిక్ ఫార్మింగ్ లో స్వయం సహాయక సంఘాలు

**- వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**

**- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేయాలి**

**- కూరగాయలు, పూల ఉత్పత్తులకు మార్కెటింగ్**

ముద్ర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్ లో భాగస్వాములుగా చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యవసాయ అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గోడౌన్లు, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్తును విక్రయించుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని తెలిపారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలతో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై చర్చించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టని అనేక సంక్షేమ పథకాలను రైతుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్ద సంఖ్యలో పంపిణీ చేస్తుందనీ, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని ఈ అంశాన్ని రైతు లకు చక్కగా వివరించాలని మంత్రులు సూచించారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల కింద వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న తీరు, నీటి సరఫరా, యాసంగి వరి సాగు, మార్కెట్లోకి రానున్న ధాన్యం, సేకరణ తదితర అంశాలపై మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు లు సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్య దర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ అల్దాస్ జానయ్య పాల్గొన్నారు.

## జిల్లాలో గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

**- వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




ముద్ర ప్రతినిధి, కోదాడ: సూర్యాపేట జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. శుక్రవారం అయన అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌర సరఫరాల అధికారులతో ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 4,15,509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని ప్రస్తుతం జిల్లాలో 17,647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.

గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని కలెక్టర్ హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీని యారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సర ఫరా చేయడం జరుగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరా లకు వినియోగించే గ్యాస్ సరిపోను ఉందని, గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆం దోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీలతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



ముద్ర ప్రతినిధి, భువనగిరి : కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు శుక్రవారం పట్టణంలోని కుమ్మరి వాడ కుండల బజార్ లో పట్టణ కుమ్మరి సంఘం అధ్యక్షుడు చిన్నగారి బాలరాజ్ అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పాల్గొని ముళ్ళమాంబ విగ్రహానికి పూలమాలవేసి మాట్లాడారు. రామాయణాన్ని అందరికీ అందుబాటులో ఉండే విధంగా రచించింది కబయిత్రి మొల్లమాంబ అని అన్నారు. కుమ్మరులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందితేనే బలోపేతం అవుతారని అన్నారు. బ్రహ్మకు ప్రతిరూపమే కుమ్మరులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ లు బండారు స్వర్ణలత, పచ్చాల జగన్మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరి నరసింహ, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి గోపాల్, బిజెపి నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు కుమ్మరి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అధ్యక్షుడు చినగారి బాలరాజ్, కార్యదర్శి తాడూరి మహేష్, కోశాధికారి తాడూరు శ్రవణ్ లు అన్న ప్రసాద వితరణ గావించారు.

## ఎల్పీజీ సిలిండర్ల కోసం ఆందోళన చెందవద్దు

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : జిల్లాల్లో గృహావసరాలకు ఎల్పీజీ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎల్పీజీ గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో గృహావసరాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు, అంగన్వాడి కేంద్రాలకు, ఆసుపత్రులకు సిలిండర్ కొరత రాకుండా చూసుకోవాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు సూచించారు. జిల్లాలో గృహావసరాలకు సిలిండర్లకు కొరత లేదనీ, వాణిజ్య సిలిండర్లకు కొంత ఇబ్బంది ఉందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెంది అవసరానికి మించి అడ్వాన్సుగా బుకింగ్ చేసుకోవద్దనీ అన్నారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ప్రస్తుతం ఉన్న సిలిండర్ల నిల్వలు, ఇప్పటి వరకు వచ్చిన బుకింగ్ లు, ఏజెన్సీల నుండి రోజుకు వచ్చే సిలిండర్ల వివరాలను డిస్ట్రిబ్యూటర్లను అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూటర్లు వారి వద్ద ఉన్న సిలిండర్ల వివరాలు వెల్లడిస్తూ గృహావసరాలకు వాడే సిలిండర్లు ఎప్పటి లాగానే సప్లై అవుతున్నాయని, కేవలం వాణిజ్య సిలిండర్లు తప్ప గృహ అవసరాలకు ఎలాంటి సమస్య లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు.

జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ సిలిండర్ల సరఫరా చేసే టైంలో పోలీస్ వారి ప్రొటెక్షన్ అవసరం కావాలి అంటే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సామాజిక ప్రసార మాధ్యమాలలో గ్యాస్ సిలిండర్లపై అసత్య ప్రచారాలు చేయవద్దన్నారు. జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతుందని 928 1423623 నెంబర్ సంప్రదించవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీఓలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై అధికారి రోజా రాణి, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు పరిరక్షించాలి

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




ముద్ర ప్రతినిధి, భువనగిరి : భూగర్భ జలాలు పరిరక్షిచడం వలన భవిష్యత్ తరాలకు తగినంత నీటి వనరులు అందుబాటులో ఉంటాయని స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో కేంద్రీయ భూగర్భ జల బోర్డు ఆధ్వర్యంలో భూగర్భ జలాల సంరక్షణపై ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసి స్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం నీటి ఎద్దడిని నివారించేందుకు భూగర్భ జల వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. శాస్త్రవేత్తలు పరిశోధనలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ఇంకుడు గుంతలు నీటి కుంటల ద్వారా భూగర్భ జలాలను పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ నీటి సంరక్షణ కార్యక్రమంలో 100 మంది గ్రామీణ ప్రాంతంలో పని చేసే వారికి కేంద్రీయ భూగర్భ జల శాఖ వారి అధ్యయనాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. సిజిడబ్ల్యూ రీజినల్ డైరెక్టర్ జ్యోతి కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పద్ధతుల ద్వారా భూగర్భ జల సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు. అనంతరం భూగర్భ జలమండలి ముద్రించిన NAQUIM రిపోర్ట్, జిల్లా రీఛార్జ్ మ్యాప్ ను విడుదల చేశారు.

జిల్లా భూగర్భ జల అధికారి జ్యోతి కుమార్ మాట్లాడుతూ భువనగిరి నీటి ఎద్దడిని నివారిం చేందుకు భూగర్భ జల వనరులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు.


ఈ కార్యక్రమంలో సిజిడబ్ల్యూబి శాస్త్రవేత్త యాదయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జెఏసి చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, సుధీర్ కుమార్, మాధవి, సరిత, రేష్మ పిల్లాయి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న క్యామ మల్లేష్



ముద్ర, బీబీనగర్: బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో శుక్రవారం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ లింగయ్య గౌడ్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు మంచాల రవికుమార్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింతల నాగలక్ష్మి లక్ష్మీనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ జిలకపల్లి లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, టిఆర్ఎస్వి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నాగేష్, రాష్ట్ర గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుండబోయిన అయోధ్య యాదవ్, నాయకులు యాకరి యాదగిరి, జగన్, అజయ్, సిల్వేరు భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ కొరతపై ఖాళీ సిలిండర్, కట్టెల వంటతో నిరసన



ముద్ర ప్రతినిధి, భువనగిరి: వంట గ్యాస్ కొరతపై ఖాళీ గ్యాస్ సిలిండర్, కట్టెలతో వంట చేస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సహ ఇంచార్జ్ కుమారి భవ్య జి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, జిల్లా ఇన్చార్జ్ హరి ప్రసాద్ నాయక్, సహ ఇన్చార్జులు అరవింద్ ,కైసర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి సురేష్, పుట్ట గిరీష్ కుమార్ గౌడ్, రాష్ట్ర లీగల్ సేల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు బద్దం వాసుదేవ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని వరుణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏడు మేకల మహేష్ యాదవ్, దయ్యాల శ్రీశైలం, రేగు రమేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు చేగురి బాలక్రిష్ణ, మంద గణేష్, మండల అధ్యక్షుడు వలిగొండ, భువనగిరి, తుర్కపల్లి, పోచంపల్లి, ప్రవీణ్, కనుకుంట్ల కొండలు, సురేష్, సందీప్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడులో గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో శుక్రవారం సివిల్ సప్లయాస్, రెవెన్యూ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి హోటళ్లు, పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నిల్వ చేసిన 34 వంట గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి వరదరాజులు మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లు, దుకాణాల్లో వినియోగించకూడదన్నారు. వినియోగదారులు అవసరానికి మించి గ్యాస్ బుకింగ్‌లు చేయకూడదని సూచించారు. గ్యాస్ కొరత లేనప్పటికీ కొందరు అవసరానికి మించి నిల్వ చేయడంతో కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై గోదాముకు తరలించినట్లు చెప్పారు.

ఆయన వెంట సివిల్ సప్లయాస్ ఆర్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

ముద్ర ప్రతినిధి, భువనగిరి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని ప్రధాన ఆలయం నందు అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.



## అనిత కుటుంబానికి అండగా ఉంటాం..

**- తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : మున్సిపల్ కార్మికురాలు ఆడెపు అనిత అనారోగ్యంతో మృతి చెందగా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో బాలుడి మృతి

ముద్ర, వరంగల్: విద్యుత్ షాక్ తో ఓ బాలుడు మృతి చెందాడు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాదన్నపేట గ్రామానికి చెందిన 10 ఏళ్ల బాలుడు ఇంటి సమీపంలో ఆడుకుంటూ సర్వీస్ వైర్‌ను తాకాడు. దీంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టాప్ 10 ఏసీ చిట్కాలు
వోల్టేజ్ సమస్యలున్న ప్రాంతాల్లో స్టెబిలైజర్ ఉపయోగించండి
వోల్టేజ్ హెచ్చుతగ్గులు ఉన్న ప్రాంతాల్లో స్టెబిలైజర్ ఏసీని రక్షిస్తుంది



## కలెక్టర్‌ను కలిసిన టీయూడబ్ల్యూజే బృందం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి ఆధ్వర్యంలో బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి డైరీ అందజేశారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, యూనియన్ సీనియర్ నాయకులు, జర్నలిస్టులు ఫరూక్ హుస్సేన్, మురళీధర్, ఖయ్యూం, రాజశేఖర్, లక్ష్మినారాయణ, నర్సింలు, అల్లాడి శేఖర్, కృష్ణమూర్తి, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు: కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని, వినియోగదారులు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, వృద్ధాశ్రమాలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ఎల్‌పి.జి డిస్ట్రిబ్యూటర్లకు ఏదైనా సమస్య ఎదురైతే స్థానిక ఎస్‌హెచ్‌ఓ లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాలసరోజ, సహాయ పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, సంక్షేమ శాఖల అధికారులు అఖిలేష్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్ అంబదాస్, లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, ఎల్‌పి.జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సభ్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**- ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు**



**ముద్ర న్యూస్ :**

గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు అధికారులతో సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సూచించారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పెద్దగుల్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అలాగే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఎస్సీ, బీసీ సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని వివరించారు.

## చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం

**ముద్ర న్యూస్ :**

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సిరికొండ ఎంపీడీవో మనోహర్ రెడ్డి అన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తా వద్ద ఉపసర్పంచ్ గ్యామ శోభన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పలు సెంటర్లలో దాతల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ద్రాహం తీర్చడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీడీసీ చైర్మన్ స్వామి, గంగాధర్, రాము, దిగంబర్, జగన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనతో సమస్యలకు పరిష్కారం

- **మంత్రి గడ్డం వివేక్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రివర్యులు సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు రూ.3 కోట్ల 42 లక్షల 39 వేల విలువైన 342 కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉండి, ప్రతినెల ఆ అప్పుపై మిత్తిగా రాష్ట్ర ఆదాయంలో 40 శాతం చెల్లిస్తున్నప్పటికీ ప్రజా సంక్షేమానికి లోటు రాకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మాట ఇచ్చిన ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం సమర్థంగా అమలవుతోందని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా ఇల్లు నిర్మించుకున్న వారికి కూడా త్వరలోనే సాంక్షన్ ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డులను ఇప్పటికే ఇచ్చామని, త్వరలోనే అర్హత ఉన్న వారికి వృద్ధాప్య పెన్షన్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. రూ.13 వేల కోట్ల వ్యయంతో నిరుపేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మిట్ ద్వారా ఐదు లక్షల ఉద్యోగాలు రానున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 119 అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. దీంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో రూ.18 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సిద్దిపేట ఆర్డీవో సదానందం, సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, నాయకులు పూజల హరికృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

- **పక్కదారి పడితే కఠిన చర్యలు**
- **కంట్రోల్ రూమ్ ఏర్పాటు : 9391942254**
- **కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



మెదక్ జిల్లాలో గృహావసరాలకు గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. జిల్లాలో 3,84,373 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, 16 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని తెలిపారు. నర్సాపూర్‌లో హోటళ్లు, రెస్టారెంట్లలో అక్రమంగా గ్యాస్ నిల్వ చేసిన వారిపై దాడులు నిర్వహించి 44 సిలిండర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకోవద్దని సూచించారు. జిల్లాలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా సాధారణంగా, నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌లు, హాస్టల్‌లు, ఓల్డ్ ఏజ్ హోమ్‌లు, పాఠశాలలు, అత్యవసర సేవల్లో గ్యాస్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాజా ప్రచారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా గ్యాస్ నిల్వ చేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సందేహాల నివృత్తి కోసం జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. గ్యాస్ సంబంధిత సమస్యలు ఉంటే 9391942254 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పర్యవేక్షణ కోసం పోలీస్, సివిల్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి గ్యాస్ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం కలిగే పరిస్థితులు లేదా అక్రమాలు జరిగితే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో గ్యాస్ కొరత ఉందని వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు గ్యాస్ బుకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులు వచ్చినప్పుడు ఓపెన్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సైబర్ క్రైమ్‌కు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా డీసీఎస్‌ఓ నిత్యానంద, డీపీఆర్వో రామచంద్ర రాజు, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ జర్జీ, ఏపీఆర్వో బాబురావు తదితరులు పాల్గొన్నారు.



**గ్యాస్ ఏజెన్సీలతో అదనపు కలెక్టర్ సమీక్ష**

మెదక్ జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌర సరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేస్తున్నామని తెలిపారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను ఎవరైనా కమర్షియల్‌గా ఉపయోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్ ఏజెన్సీలు తనిఖీ చేసిన ఆర్డీఓ రమాదేవి**

మెదక్‌లోని గ్యాస్ ఏజెన్సీలు, హోటళ్లలో మెదక్ ఆర్డీఓ రమాదేవి తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ కొరతను కృత్రిమంగా సృష్టించవద్దని ఆమె సూచించారు. గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల సందర్భంగా ఆమె వెంట తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో ఏసీబీ తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ ఉమ్మడి జిల్లా డీఎస్పీ సుదర్శన్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి పరిపాలన విభాగంలో ఏసీబీ ఉమ్మడి జిల్లా డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మెడికల్ బిల్లులకు సంబంధించిన సెక్షన్‌లో వివిధ రకాల ఫైళ్లను పరిశీలించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల విషయంలో సూపరింటెండెంట్ లతీఫుద్దీన్ ముజాయిద్దీన్ నిర్వహణలో పలు లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఔట్‌వర్డ్, మూమెంట్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించడం లేదని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను సమయానికి పంపించడం లేదని, తృణమో ఫలమో అందితే తప్ప బిల్లులను పాస్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. ఆ సెక్షన్‌లో మొత్తం 282 బిల్లులు ఉండగా, వాటిలో 116 బిల్లులను సంబంధిత శాఖలకు పంపకుండా సూపరింటెండెంట్ తమ వద్దే ఉంచుకున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈ తనిఖీలలో ఇన్‌స్పెక్టర్లు రమేష్, వెంకటేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.





# ఓటర్ల జాబితా ప్రక్రియను వేగవంతం చేయండి

- **రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఓటు నమోదు కాకుండా జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. రాజకీయ పార్టీల ద్వారా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించడంతో పాటు బీఎల్ఓలకు ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మరణించిన ఓటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ సవరణ ప్రక్రియలో మంచి పురోగతి సాధిస్తున్నామని, ఇదే ఉత్సాహంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. డీఎస్ఈ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓ పటాన్ చెరువు అంబదాస్ రాజేశ్వర్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

14.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ఏసీ చిట్కాలు

పీఎం 2.5 ఫిల్టర్ ఉన్న ఏసీ ఆరోగ్యానికి మంచిది ఇది గాలిలోని సూక్ష్మ ధూళి కణాలను వడపోసి స్వచ్ఛమైన గాలి అందిస్తుంది.



# సినిమా టికెట్ ధరల పెంపుపై సుప్రీం స్టే

- పాత విధానాన్నే ఫాలోకండి
- 90 రోజుల ముందు నిబంధన తీర్పుపై స్టే

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




తెలుగు రాష్ట్రాల్లో సినిమా టికెట్ ధరల పెంపుపై నెలకొన్న సందిగ్ధతకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు విషయంలో గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు స్టే ఇస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సినిమా టికెట్ ధరలు పెంచుకోవాలంటే, సదరు చిత్రం విడుదలకు కనీసం 90 రోజుల ముందే ప్రభుత్వం జీవో జారీ చేయాలని హైకోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయంతో పెద్ద సినిమాల విడుదలకు, వాటి బడ్జెట్ రికవరీకి ఇబ్బందులు తలెత్తుతాయని చిత్ర పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు హైకోర్టు ఇచ్చిన ఈ 90 రోజుల నిబంధనను సవాల్ చేస్తూ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధిస్తూ.. టికెట్ ధరల పెంపు విషయంలో ఇప్పటి వరకు అనుసరిస్తున్న పాత విధానాన్నే పాటించాలని స్పష్టం చేసింది. తాజాగా రేట్ల పెంపుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో పెద్ద సినిమాలు విడుదలైనప్పుడు ప్రభుత్వ అనుమతితో అప్పటికప్పుడు రేట్లు పెంచుకునే అవకాశం మళ్లీ లభించినట్లయింది.

# ప్రగతి పథంలో పేదల సంక్షేమం

- అభివృద్ధి పనులకు సమప్రాధాన్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**ముద్ర, ఖమ్మం :**

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం పరుగులు పెడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల చెంతకు చేరుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండున్నరేండ్ల కాలంలోనే కేవలం బీరోలు గ్రామానికి రూ. 29.92 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇందులో భాగంగా రూ. 2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. బంధంపల్లిలో రూ. 5.50 కోట్లతో దమ్మాయిగూడెం నుంచి సోలిపురం రోడ్డు మధ్య నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, కల్వర్టుల నిర్మాణం, చెరువు మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేశామని వివరించారు. ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసితండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఇతర అధికారులు ఉన్నారు.

# షేక్ రుక్సానాకు అంతర్జాతీయ ఐఈఈఈ ఉత్తమ అవార్డు

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్ :**



విషయం ఏదైనా, రంగం ఏదైనా వాటి కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్న నేటి సమాజంలో ప్రత్యామ్నాయ పరిజ్ఞానాన్ని ప్రతిపాదించడం అభినందనీయమని వాసవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి. రమణ అన్నారు. ఎమర్జింగ్ స్మార్ట్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ ఆధ్వర్యంలో పూణేలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు మూడు రోజుల పాటు నిర్వహించారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ రుక్సానా కొత్త ప్రతిపాదనతో ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్పీవై అనేది బృహత్ భాష నమూనాల కోసం ప్రాంప్ట్‌లను ఆటోమేటిక్‌గా స్వీకరించి సరైన, ఖచ్చితమైన సమాధానాన్ని అందించే ప్రణాళిక అని తెలిపారు. ఇందులో ప్రాంప్ట్‌లను స్థిరమైన సూచనలుగా కాకుండా నేర్చుకునే పరామితులుగా పరిగణిస్తామని వివరించారు. ఈ పరిశోధనలో డీఎస్పీవై ఆధారిత విధానంతో సూచనలను మెరుగుపరచి వాస్తవాల ఖచ్చితత్వాన్ని పెంచడం, భ్రమలను తగ్గించడం, పనితీరును మెరుగుపరచడం సాధ్యమవుతుందని చూపించామని తెలిపారు. అంతర్జాతీయ గుర్తింపుగా ఈ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.

# గ్యాస్ సరఫరాపై హై లెవల్ కమిటీ

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



అమెరికాఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడిందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. అసత్య ప్రచారానికి తెరదించి గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ఎలాంటి గందరగోళానికి గురి కావొద్దని, గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి గందరగోళం కారణంగానే రోజువారీగా 72 శాతం బుకింగ్స్ పెరిగినట్లు తెలిపారు. అయితే గృహ వినియోగదారులతో పాటు ఆస్పత్రులు, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 810 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉండగా రోజువారీగా సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ మార్కెటింగ్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదని, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. తాజా ప్రచారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా గ్యాస్ నిల్వ చేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఇప్పటివరకు 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఇదే విధంగా ప్రవర్తిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి ఎల్‌పీజీ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా జరుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆసరా ఆశలపై నీళ్లు

- కొత్తవి రావు.. పాతవి పెరగవు
- ఆసరా కోసం ఎదురుచూపులు
- 25 లక్షల దరఖాస్తులు పెండింగ్
- రెండెండ్లలో 2 లక్షల పెన్షన్లు రద్దు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- పట్టించుకోని అధికారులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



రాష్ట్రంలో ఆసరా పింఛన్ల కోసం రెండేండ్లుగా పేదలు ఎదురుచూస్తున్నారు. కొత్తవి రావడం లేదు. పాత పింఛన్లు పెరగడం లేదు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు దాటిన ఆసరా చేయూత ముందుకు పడట్లేదు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పెట్టి పింఛన్లు పెంచుతామని ప్రకటించింది. ప్రజా పాలన ద్వారా 202425 రెండు దఫాలుగా కొత్తగా 24.85 లక్షల దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు అర్హులను ఎంపిక చేయలేదు. పాత పింఛన్ల పెంపు కొత్త పింఛన్ల మంజూరు ఇప్పటి వరకు జరగలేదు. దరఖాస్తు దారులు కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వివిధ కారణాలతో దాదాపు రెండు లక్షల పింఛన్లు రద్దు చేశారు. 202324 ప్రకారం 44,49,767 మంది ఆసరా పింఛన్ దారులు ఉన్నారు. వికలాంగులు, వృద్దులు, వితంతువులు, వ్యాధిగ్రస్తులు, గీత, చేనేత కార్మికులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఆసరా వికలాంగుల పింఛన్లను రూ.6,016 కు, మిగతా పింఛన్లు రూ.4,016కు పెంచాలి. అధికారంలోకి వచ్చి రెండేడ్లు గడుస్తున్నా సర్కార్ తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

**ఆదాయ పరిమితి పేరిట పింఛన్లను తగ్గిస్తే సహించేది లేదు..**



జీవో నం. 17ను తెరపైకి తెచ్చి ఆదాయ పరిమితి పేరిట పింఛన్లను తగ్గిస్తే సహించేది లేదని అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లను ఇవ్వాల్సిందే అని విహెచ్ఎస్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కనకబోయిన నాగరాజు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# శ్రీశైలానికి గవర్నర్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబ సమేతంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరారు. మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్‌కు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపత్ రావు పాటిల్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొంతసేపు విరామం తీసుకున్న అనంతరం గవర్నర్ నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# దోపిడి ఉన్నంత కాలం మావోయిజం ఉంటుంది

- మావోయిస్ట్ మాజీ అగ్రనేతలు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కేంద్రం నిర్వహించిన ఆపరేషన్ కగార్ తమ ముందుకు చిన్న విషయం అని మావోయిస్ట్ మాజీ అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ కగార్ తో భయపడో... లేక ప్రాణాలకు భయపడో తాము జనజీవనం స్రవంతిలో కలవలేదని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగారుతో పాటు అంతకు ముందు జరిగిన అనేక ఆపరేషన్ల సమయంలో అడవుల్లోనే ఉన్నామన్న ఆయన అప్పుడు కూడా అనేక దాడులు జరిగాయన్నారు. విభిన్న ప్రాంతాల్లో ఉన్న కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం కోసమే తాము అడవి బయటకు వచ్చామని ఇంతలో పోలీసులు అరెస్టు చేశారన్నారు. బయటకు వచ్చిన మమ్మల్నీ పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారు తప్ప ప్రాణభయంతో మేము బయటకు రాలేదన్నారు. గెరిల్లా ఎత్తుగడలు అజేయమన్న ఆయన వాటిని సరైన విధంగా ఆచరించకపోవడంతోనే పార్టీ నిర్వీర్యమైందని వెల్లడించారు. దోపిడీ ఉన్నంతకాలం మావోయిస్టు ఉద్యమం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరిస్థితులపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని కీలక ప్రకటన చేశారు. మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేసి, జైళ్లలో ఉన్న మావోయిస్టులను రాజకీయ ఖైదీలుగా గుర్తించి విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బలగాల ముందు మావోయిస్టు అగ్ర నేతలు, పార్టీ సభ్యులు లొంగిపోవడానికి కారణాలను వారిద్దరు వివరించారు. ప్రచారం జరుగుతున్నట్లు అసలు తాము పోలీసుల ఎదుట లొంగిపోలేదని స్పష్టం చేశారు. తాము మొదటి నుంచీ జనజీవన స్రవంతిలోనే ఉన్నామన్నారు. పార్టీ అత్యంత కీలక సమయాల్లో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. మరోవైపు మావోయిస్టు పార్టీని విస్తరించడంలో తాము విఫలమయ్యామని వారు అంగీకరించారు. కేంద్రం తాను చేపట్టిన 'ఆపరేషన్ కగార్'గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటోందన్నారు. వాస్తవానికి ఆపరేషన్ కగార్ తమ ముందు చాలా చిన్న విషయమని దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలో లక్షలాది మంది ప్రజలతో కలిసి పట్టణాల్లో, మైదానాల్లో, అడవుల్లో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించినట్లయితే.. అంతటి ప్రజా పునాది కలిగిన మావోయిస్టు పార్టీని ఏ 'ఆపరేషన్ కగార్' కూడా ఏమీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా సకాలంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడమే పార్టీకి నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.మావోయిస్టు పార్టీ తన వైఫల్యాలను సమీక్షించుకునే లోపే ప్రభుత్వం 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం' లాగా ఈ ఆపరేషన్ చేపట్టిందన్నారు. ఒక చిన్న గెరిల్లా దళాన్ని నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా 8.5 లక్షలకు పైగా పోలీసు, పారామిలటరీ, వివిధ రకాల కమాండో దళాలతో పాటు భారత సైన్యం, వాయుసేనను రంగంలోకి దించి కేంద్రం యుద్ధం చేసిందన్నారు. తమ లొంగుబాటుకు ఇవన్నీ సెంకడరీ కారణాలైతే.. రాజకీయంగా ఒక బలమైన నినాదాన్ని తీసుకుని ప్రజల ముందుకు వెళ్లకపోవడమే ప్రధాన పొరపాటని ఆయన విశ్లేషించారు.

**బస్వరాజుకు కోల్పోవడం బాధించింది**

ప్రధానంగా మావోయిస్టు పార్టీ నిర్వీర్యం కావడానికి 'ఆపరేషన్ కగార్' కంటే పార్టీ తీసుకున్న తప్పుడు రాజకీయ నిర్ణయాలే ప్రధాన కారణమని దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ కగార్ యుద్ధం మొదలయ్యే సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదనీ అందుకే ప్రతిఘటన అనివార్యమైందని చెప్పారు. ఈ పోరాటంలో బస్వరాజును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్వరాజ్ మరణం తర్వాత కొందరు అడవుల్లో.. జనంలో ఉండాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే హిడ్మా ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోవాలనుకున్నారని వివరించారు.. విజయవాడలో కొందరు నమ్మకస్తులు(పోలీస్ డిపార్ట్మెంట్‌లో) ఉన్నారని చెప్పారు. తమకు అనుమానం వచ్చి వద్దని వారించామమన్నారు. కానీ హిడ్మా వినకుండా మాకే సర్దిజెప్పే ప్రయత్నం చేశారన్నారు. చాలారోజుల పాటు పరిశీలించి చివరకు ఆయన లొంగిపోయేందుకు అనుమతి ఇచ్చినట్లు దేవ్ జీ,దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి చెప్పారు. హిడ్మా అంచనాలు సరైనవి కావన్న దేవ్ జీ.. తాము ఊహించిన విధంగానే హిడ్మాను ట్రాప్ చేసి, అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఇది వందశాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

**గణపతి ఆరోగ్యం సహకరించదు..**

మావోయిస్టు అగ్రనేత గణపతి ప్రస్తుతం ఉద్యమాన్ని నడిపే పరిస్థితి లేదని దేవ్ జీ, దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి చెప్పారు. ఆయన ఆరోగ్యం సహకరించకపోవడంతోనే ఉద్యమ బాధ్యతలు ఇతరులకు అప్పగించి ఆయన బయటకు వెళ్లిపోయారన్నారు. రెండేళ్ల క్రితం ఆయనను కలిశామన్నారు. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలోనే గణపతిని చూసినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆయన తన దారిలో వెళ్లారనీ మళ్లీ కనిపించలేదన్నారు. మావోయిస్టు ఉద్యమం బలహీనపడిపోయిందనేది స్పష్టంగా తెలుస్తోందన్న ఆయన మిగిలి ఉన్న కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇప్పటికీ ప్రజల మధ్యే తిరుగుతున్నారన్నారు. వారంతా ఏదైనా ఆలోచన చేస్తే భవిష్యత్ కార్యాచరణ నిర్ధారించుకోవచ్చని సూచించారు. వారికి తమ సహకారం కూడా ఉంటుందన్నారు. తమతో వారు ఏకీభవిస్తారా లేదా అనేది వారి ఇష్టం అన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మాజీ మావోయిస్టులు, అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసే కార్యక్రమం చేపట్టబోతున్నామని దేవ్ జీ,దేవ్ జీ,మల్లా రాజిరెడ్డి చెప్పారు. తమ శేష జీవితం ప్రజల కోసమే ఉండబోతుందనేది ప్రజలకు వివరిస్తామన్నారు. మిగిలిన మావోయిస్టులను అజ్ఞాతం నుంచి బయటకు పిలవాలని ఇంటెలిజెన్స్ అధికారులు తమతో చెప్పారన్నారు. అప్పటి వరకు ఆపరేషన్ కగార్‌ను తాత్కాలికంగా వాయిదా వేయిస్తామని చెప్పారన్నారు. అదే విషయాన్ని బహిరంగ ప్రకటన చేస్తే వారిని పిలవడానికి మేము సిద్ధమే అని తాము చెప్పామన్నారు. రాజకీయాల్లోకి వచ్చే ప్రస్తే లేదని రాజిరెడ్డి స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 ఏసీ చిట్కాలు**

సీజన్ ప్రారంభానికి ముందు ఫిల్టర్లు శుభ్రం చేయండి ఫిల్టర్లలో దుమ్ము ఉంటే కూలింగ్ తగ్గిపోతుంది, కంప్రెసర్‌పై భారం పడుతుంది.




# పోలీస్ శాఖలో కొలువుల జాతర

- **17 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వానికి ఫైలు**
- **రాష్ట్రస్థాయికి ఎస్సై పోస్టులు**
- **సర్వీస్ రూల్స్‌లో సవరణలు**
- **త్వరలోనే ఆమోదం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో భారీగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. దాదాపు 17 వేల ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్ ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో ఇప్పటివరకు జోనల్ పోస్టులుగా ఉన్న ఎస్సైలను ఇక నుంచి రాష్ట్రస్థాయికి మార్చాలని ప్రతిపాదనలు కూడా చేశారు. ఈ క్రమంలోనే పోలీస్ సర్వీస్ రూల్స్‌లో చేయాల్సిన మార్పులను ప్రభుత్వానికి పంపించింది. ఈ ప్రతిపాదనలు సర్కార్ ఆమోదిస్తే కొలువుల జాతరే. పదోన్నతుల విషయంలో తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో పోలీస్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే, జోన్లతో సంబంధం లేకుండా ఎస్సై పోస్టులు రాష్ట్రస్థాయిగా మారనున్నాయి.

**జోన్ మార్పు..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక విద్య, ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పించే ఉద్దేశ్యంతో రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించారు. పోలీస్ శాఖలో ఎస్సై పోస్టును జోనల్ స్థాయిలో ఉంటారు. అంటే ఏ జోన్‌కు ఎంపికైన ఎస్సైలు అదే జోన్‌లో పనిచేయాల్సి ఉంటుంది. అదే జోన్‌లో ప్రమోషన్ కూడా పొందొచ్చు. అయితే ఈ నిర్ణయం వల్ల కొంతమంది ఎస్సైలకు అన్యాయం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకే బ్యాచ్‌లో ఎస్సైలుగా సెలెక్ట్ అయి ఉద్యోగంలో చేరినప్పటికీ, ఆయా జోన్లలో ఉన్న ఖాళీల కారణంగా కొందరికి ముందుగానే ప్రమోషన్లు వస్తున్నాయి. ఖాళీలు ఉన్న జోన్‌లోని ఎస్సైలు సీఐ, డీఎస్పీ, అదనపు ఎస్పీలుగా ప్రమోషన్లు అందుకుంటుంటే, అదే బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికై ఇతర జోన్లలో ఉన్న వారు మాత్రం ఇంకా ఎస్సైలుగానే మిగిలిపోతున్నారు.

**కొత్తగా భర్తీ**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి 2015లో దాదాపు 18 వేలు, 2018లో 18,428 ఉద్యోగాలు, 2022లో 15,644 ఉద్యోగాలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేసింది. అయినా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి పోలీస్ శాఖలో 17 వేలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు పోలీస్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. పోలీస్ శాఖలో మొత్తం 95,361 పోస్టులు ఉండగా అందులో 77,369 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని, ఇంకా 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖలో ఏడాదికి 6 వేల నుంచి 7 వేల మంది రిటైర్మెంట్ అవుతుండటంతో భారీగా ఖాళీలు ఏర్పడుతున్నాయి.



# యువత రాజకీయాల్లోకి రావాలి

- **భారత్ ను తిరిగి విశ్వగురువుగా చేయాలి**
- **గౌరవప్రదంగా విభేదించడం' ప్రజాస్వామ్య లక్షణం**
- **నేతల ప్రవర్తన, భాష హుందాగా ఉండాలి**
- **మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**
- **పూణే ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగం**

**న్యూఢిల్లీ :**

దేశ భవిష్యత్తు అయిన యువత విలువైన సిద్ధాంతాలతో రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో పూణేలోని 'ఎంఐటి స్కూల్ ఆఫ్ గవర్నెన్స్' కు చెందిన ఎం.ఏ. పొలిటికల్ లీడర్‌షిప్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం వారితో ముచ్చటించి వారు అడిగిన సందేహాలను తీర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం అధికారం కోసం కాకుండా విలువలతో కూడిన రాజకీయం ఉండాలన్నారు. రాజకీయాల్లో మొదటి సూత్రం ఎదుటి వ్యక్తి దృక్పథాన్ని గౌరవించడమన్నారు. ఒకవేళ ఏకీభవించకపోతే గౌరవప్రదంగా విభేదించాలే తప్ప వ్యక్తిగత దాడులు చేయొద్దని సూచించారు. అడ్డంకులు సృష్టించే రాజకీయం కంటే అభివృద్ధి, నిర్మాణాత్మక చర్చలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా జీవితంలో నేతల ప్రవర్తన, భాష హుందాగా ఉండాలన్నారు. ప్రత్యర్థులను శత్రువులుగా చూడకుండా వారి అభిప్రాయాలను గౌరవించే సంస్కృతిని అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన సమయ పాలనే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీ వంటి నేతల సమయ పాలనను ఉదహరించారు. తాను వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులను కూడా స్వశక్తితో ఎదగాలని ప్రోత్సహించానన్నారు. నాయకులు పారాచూట్ లాగా దిగకూడదని, క్షేత్రస్థాయి నుంచి కష్టపడి పైకి రావాలని సూచించారు. డిజిటల్ విప్లవం వల్ల అవినీతి తగ్గుతోందని, అయితే యువత గ్యాడ్జెట్లకు బానిసలై తమ సృజనాత్మకతను కోల్పోకూడదని హెచ్చరించారు. భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. యువత రాజకీయాల్లోకి వచ్చే ముందు వివేకానంద, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్, వాజ్‌పేయి వంటి మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలన్నారు. మాతృభాష కంటిచూపు వంటిదని, పరభాషలు కళ్లజోడు వంటివని ఆయన అభివర్ణించారు. రాజ్యసభలో 22 భాషల్లో మాట్లాడే వెసులుబాటు కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ నాయకులు తమ ప్రజలకు చేరువ కావాలంటే మాతృభాషలోనే మాట్లాడాలని సూచించారు. భారతదేశం మళ్ళీ 'విశ్వగురువు'గా ఎదిగేందుకు యువత తమ వంతు కృషి చేయాలన్నారు. ఇటీవల ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు, ఘర్షణల గురించి ప్రస్తావిస్తూ విస్తరణ వాదం, ఇతరుల భూభాగంపై వ్యామోహం సరికాదని, ఆధునిక నాగరికతలో యుద్ధాలు, హింస ఏమాత్రం మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు.


# నదుల పరిరక్షణకు కాలుష్య నియంత్రణ అవసరం

- **(మార్చి 14 - నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం)**

ప్రతి సంవత్సరం మార్చి 14న నిర్వహించే నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నదులు, తాగునీటి వనరుల పరిరక్షణ ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. నదుల కాలుష్యం, ఆనకట్టల నిర్మాణం, జీవ వైవిధ్య నష్టం వంటి సమస్యలపై అవగాహన పెంచుతుంది. నదులను సంరక్షించడానికి, నీటి వనరులను స్థిరంగా ఉపయోగించడానికి ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాలని ఇది ప్రోత్సహిస్తుంది. నదులపై ఆధారపడి జీవనం సాగించే స్థానిక సముదాయాల హక్కులను కూడా మద్దతు ఇస్తుంది. మొత్తంగా భవిష్యత్ తరాల కోసం నదులను పునరుద్ధరించి రక్షించడానికి ప్రపంచ స్థాయి సహకారాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. 2026 సంవత్సరానికి నిర్ణయించిన సారాంశము "నీరు మరియు లింగం" ఇది సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం మానవ హక్కులుగా ఉండాలని, అలాగే లింగ సమానత్వాన్ని సాధించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలియజేస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి ప్రకటించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు 5, 6 కూడా మద్దతు ఇస్తుంది.

ప్రస్తుతం అధిక కాలుష్యం నదుల స్థిరత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పరిశ్రమల వ్యర్థాలు, మలినజలాలు, ప్లాస్టిక్ , రసాయనాలు నీటిని కలుషితం చేయడం వల్ల నదులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీనివల్ల జలచర మొక్కలు, జంతువులు నష్టపోయి జీవ వైవిధ్యం తగ్గుతుంది, సహజ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. కాలుష్యంతో కూడిన నదీ నీరు తాగితే అనేక వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలుగుతుంది. నీటిలో అధిక పోషకాలు చేరడం వల్ల యూట్రోఫికేషన్ (Eutrophication) అనే ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల ఆక్సిజన్ స్థాయి తగ్గి చేపలు, ఇతర జలజీవులు చనిపోతాయి. ప్రపంచంలో అనేక దేశాలు తీవ్రంగా కాలుష్యానికి గురైన నదుల సమస్యను ఎదుర్కొంటున్నాయి. భారతదేశం, ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో అత్యంత కాలుష్యంతో ఉన్న నదులు ఉన్నాయి. కొన్ని దేశాల్లో మాత్రం బలమైన పర్యావరణ చట్టాలు మరియు సమర్థవంతమైన నీటి నిర్వహణ వల్ల నదులు తక్కువగా కాలుష్యానికి గురవుతున్నాయి. కెనడా, నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, న్యూజిలాండ్ వంటి దేశాలు తక్కువ కాలుష్యంతో ఉన్న నదుల కోసం ప్రసిద్ధి చెందాయి. ఈ దేశాలు పరిశ్రమల వ్యర్థాలను కట్టుదిట్టంగా నియంత్రించి, మలినజలాలను శుద్ధి చేసిన తర్వాత మాత్రమే నీటి వనరుల్లో విడుదల చేస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా నదుల కాలుష్యం గురించి అనేక అంతర్జాతీయ సంస్థలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(UNEP) నివేదిక ప్రకారం ప్రతిరోజూ సుమారు 2 బిలియన్ టన్నుల మానవ వ్యర్థాలు నదులు, ఇతర నీటి వనరుల్లోకి విడుదల అవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి జల నివేదికల ప్రకారం



ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే మలినజలాలలో 80% కంటే ఎక్కువ సరైన శుద్ధి లేకుండా నదులు సరస్సుల్లోకి వదిలివేయబడుతున్నాయి ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాల్లోఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(WHO) ప్రకారం కలుషిత నీటి కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 1.8 మిలియన్ మంది మరణిస్తున్నారు. ఆహార వ్యవసాయ సంస్థ (FAO) నివేదిక ప్రకారం ప్రపంచంలోని త్రాగునీటి కాలుష్యంలో సుమారు 70% వరకు వ్యవసాయ రంగం కారణం అవుతోంది. ఎరువులు, పురుగుమందులు పశువుల వ్యర్థాలు నదుల్లో కలవడం వల్ల ఈ కాలుష్యం పెరుగుతోంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN) మద్దతుతో చేసిన అధ్యయనాలు నదుల కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా త్రాగునీటి జీవ వైవిధ్యానికి ప్రధాన ప్రమాదాల్లో ఒకటని హెచ్చరిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు సమాచారం ప్రకారం నీటి కాలుష్యం కొన్ని ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధిని మూడో వంతు వరకు తగ్గిస్తుంది. ఎందుకంటే ఇది వ్యవసాయం, మత్స్యకార రంగం త్రాగు నీటి సరఫరాపై ప్రభావం చూపుతుంది. ఓషన్ కన్సర్వెన్సీ చేసిన పరిశోధన ప్రకారం ప్రతి సంవత్సరం నదుల ద్వారా లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. దీనివల్ల సముద్ర కాలుష్యం మరింత పెరుగుతోంది. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్(WWF) నివేదిక ప్రకారం 1970 నుంచి ఇప్పటివరకు త్రాగునీటి జాతుల జనాభా 80% కంటే ఎక్కువగా తగ్గిపోయింది. దీనికి కాలుష్యం, నివాస ప్రదేశాల నాశనం మరియు ఆనకట్టల నిర్మాణం ప్రధాన కారణాలు.

**భారతదేశంలో నదీ కాలుష్యం**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (CPCB) నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా శుద్ధి చేయని మలినజలాలు పరిశ్రమల వ్యర్థాల కారణంగా భారతదేశంలో 351 కంటే ఎక్కువ నది భాగాలు కాలుష్యానికి గురైనట్లు గుర్తించారు. ఉదాహరణకు Ganga River లో ప్రతిరోజూ సుమారు 3 బిలియన్ లీటర్ల శుద్ధి చేయని మలినజలాలు చేరుతున్నాయి. జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకారం భారతదేశంలో ప్రతిరోజూ 70,000 మిలియన్ లీటర్లకు పైగా మలినజలాలు ఉత్పత్తి అవుతున్నాయి. కానీ వాటిలో సగం మాత్రమే సరైన విధంగా శుద్ధి చేయబడుతున్నాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (CSE) చేసిన అధ్యయనాలు గృహ మలినజలాలు, పరిశ్రమల వ్యర్థాలు వ్యవసాయ రసాయనాలు నదుల కాలుష్యానికి ప్రధాన కారణాలని చూపిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం అనేక ప్రాంతాల్లో కలుషిత నీటి వల్ల నీటివల్ల వ్యాపించే వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా గంగా, యమునా , గోదావరి వంటి ప్రధాన నదులు పట్టణ ప్రాంతాల దగ్గర తీవ్ర కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయి. అదేవిధంగా యమునా నది ఢిల్లీ నగరంలో తన మొత్తం పొడవులో కేవలం 2% మాత్రమే ప్రవహించినప్పటికీ, నగరంలోని సుమారు 70% మలినజలాలను మోసుకుపోతుంది. నీతి ఆయోగ్ విడుదల చేసిన మిశ్రమ నీటి నిర్వహణ సూచిక ప్రకారం భారతదేశంలోని ఉపరితల నీటిలో సుమారు 70% వరకు కాలుష్యం ఉంది. కాలుష్యంతో నదులు పర్యాటకం, మత్స్యకార రంగం మరియు స్వచ్ఛమైన నీటిపై ఆధారపడే జీవనోపాధులను దెబ్బతీస్తాయి, తద్వారా ఆర్థిక నష్టాలు కూడా కలుగుతాయి. మొత్తంగా, భారతదేశంలో నదుల కాలుష్యం ఆరోగ్యం, పర్యావరణం మరియు ఆర్థిక రంగాలపై తీవ్రమైన ప్రభావాలు చూపుతోంది.

**నదులలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు**

నదుల కాలుష్యాన్ని తగ్గించి నీటి నాణ్యతను పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు ప్రారంభించాయి. ప్రారంభ కార్యక్రమాల్లో ఒకటైన గంగా యాక్షన్ ప్లాన్ 1985లో ప్రారంభించబడింది. తరువాత ప్రభుత్వం దేశంలోని ప్రధాన నదులను శుభ్రపరచడానికి జాతీయ నదుల సంరక్షణ ప్రణాళిక (NRCP) ను ప్రవేశపెట్టింది. 2014లో భారత ప్రభుత్వం నమామి గంగే కార్యక్రమం ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా మలినజల శుద్ధి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం, నది ఉపరితలాన్ని శుభ్రపరచడం, జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలు చేపట్టబడ్డాయి. ఈ కార్యక్రమం కింద వందలాది ప్రాజెక్టులు ఆమోదించబడి నీటి నాణ్యతను మెరుగుపరచడం శుద్ధి చేయని మలినజలాలు నదుల్లోకి చేరకుండా నిరోధించడం జరుగుతోంది. నదుల కాలుష్యాన్ని పర్యవేక్షించడానికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (CPCB) తరచుగా నీటి నాణ్యతను అంచనా వేస్తూ దేశవ్యాప్తంగా కాలుష్యానికి గురైన నది భాగాలను గుర్తిస్తుంది. గంగానది పునరుద్ధరణ ప్రాజెక్టులను అమలు చేయడానికి గంగా నది శుభ్రత కోసం జాతీయ మిషన్ ప్రధాన సంస్థగా పనిచేస్తుంది. ప్రభుత్వం నీటి సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, నీటి వనరుల పునరుద్ధరణ కోసం జల శక్తి అభియాన్ ను కూడా ప్రారంభించింది. అనేక రాష్ట్రాలు కూడా తమ స్థాయిలో నది పునరుద్ధరణ కార్యక్రమాలను చేపడుతున్నాయి. ఉదాహరణకు ఢిల్లీలో యమునా నది శుభ్రపరిచే ప్రయత్నాలు అహ్మదాబాద్‌లో సబర్మతి నది అభివృద్ధి కార్యక్రమాల్లో మలినజల శుద్ధి కేంద్రాలు నది తీరాభివృద్ధి చేపట్టబడ్డాయి.

**భారతదేశంలో నదుల కాలుష్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి స్థిరమైన చర్యలు**

ప్రభుత్వం మరిన్ని మలినజల శుద్ధి కేంద్రాలను నిర్మించి శుద్ధి చేయని మలినజలాలు నదుల్లోకి చేరకుండా చూడాలి. పర్యావరణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, నదీ తీర ప్రాంతాల్లో ఉన్న నగరాలు, పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, నది తీరాల్లో వృక్షారోపణ తడిమైదానాల (Wetlands) పునరుద్ధరణను ప్రోత్సహించడం పండుగలు ఆచారాల్లో పర్యావరణహిత పద్ధతులను ప్రోత్సహించడం నది పరివాహక ప్రాంతాల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, కాలుష్యానికి కారణమైనవారిపై కఠినమైన శిక్షలు విధించడం ద్వారా పరిశ్రమల వ్యర్థాలను నియంత్రించాలి. రసాయన వ్యర్థాలను విడుదల చేసే పరిశ్రమలను కాలుష్య నియంత్రణ మండళ్లు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. స్థానిక సంస్థలు, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌరులు కలిసి పనిచేస్తే భారతదేశంలో నదుల కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి భవిష్యత్ తరాల కోసం స్వచ్ఛమైన నీటి వనరులను రక్షించవచ్చు.

– డా. పి. సుబ్రహ్మణ్యాచారి, MA, MBA, BL, Ph.D
ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్
మోహన్ బాబు యూనివర్సిటీ
శ్రీ సాయినాథ్ నగర్- 517102, తిరుపతి
ఫోన్ - 8309082823

# ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

- **పెట్టుబడులకు గ్లోబల్ హబ్**
- **వినూత్న ప్రయోగాలకు అనుకూలం**
- **ఐటీ మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం ప్రధాన వేదికగా నిలుస్తోందన్నారు. ఆవిష్కరణలకే కాకుండా పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందన్నారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి వారికి వివరించారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు.




ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హోహ్ ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## టాప్ 10 ఏసీ చిట్కాలు

చల్లటి గాలి రాకపోతే గ్యాస్ తనిఖీ చేయించండి
ఏసీ ఆన్ చేసిన తర్వాత కూడా కూలింగ్ లేకపోతే గ్యాస్ తక్కువగా ఉండే అవకాశం ఉంది.





# పాక్ ఆటగాడిని కొన్న సన్‌రైజర్స్..

- **వివాదంపై బీసీసీఐ స్పందన**

విదేశీ క్రికెట్ లీగ్‌లో పాకిస్తాన్ ఆటగాడిని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడం వివాదానికి దారితీసింది. ఈ అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి బీసీసీఐ స్పందించింది. ఇంగ్లాండ్‌లో నిర్వహించే 'ది హండ్రెడ్' టోర్నీ కోసం పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను 'సన్‌రైజర్స్ లీడ్స్' జట్టు తీసుకోవడంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వివరణ ఇచ్చారు.
శుక్రవారం మీడియాతో మాట్లాడిన రాజీవ్ శుక్లా, బీసీసీఐ పరిధి ఐపీఎల్ వరకే పరిమితమని తెలిపారు. విదేశాల్లో జరిగే లీగ్‌లలో ఫ్రాంచైజీలు ఎవరిని ఎంపిక చేసుకుంటారన్నది వారి స్వంత నిర్ణయమని పేర్కొన్నారు. అలాంటి విషయాల్లో బీసీసీఐ జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. అయితే ఐపీఎల్‌లో మాత్రం పాకిస్తాన్ ఆటగాళ్లకు అవకాశం ఉండదని వెల్లడించారు.
గురువారం జరిగిన 'ది హండ్రెడ్' వేలంలో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్ అహ్మద్‌ను సుమారు రూ.2.3 కోట్లకు దక్కించుకుంది. ఈ నిర్ణయం తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. గత ఏడాది మేలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అబ్రార్ అహ్మద్ భారత సైన్యం, వాయుసేనపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో సన్‌రైజర్స్ యాజమాన్యంపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు.
భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 2008 తర్వాత ఐపీఎల్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లకు అవకాశం లేకుండా కొనసాగుతున్న విషయం తెలిసిందే.



## అభిమానులదే ఈ వరల్డ్‌కప్ విజయం: సూర్యకుమార్ యాదవ్

భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో అభిమానుల పాత్ర కీలకమని జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత్ వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. సొంతగడ్డపై ఈ ట్రోఫీని అందించిన తొలి కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఈ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అభిమానుల మద్దతు, ప్రేమ వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. బ్యాట్ పట్టుకున్న ప్రతి చిన్నారి కల ఈ వరల్డ్‌కప్ అని, స్టేడియానికి వచ్చిన అభిమానులు అలాగే ఇంటి వద్ద నుంచి మద్దతు తెలిపిన వారందరికీ ఈ విజయం చెందుతుందని చెప్పారు. భారత్‌లో క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాదని, అది భావోద్వేగమని పేర్కొన్నారు.




## దురంధర్ సీన్ రీక్రియేట్..
# జడేజాకు ఘన స్వాగతం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరిన స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు జైపూర్‌లో ఘన స్వాగతం లభించింది. జట్టులో చేరిన సందర్భంగా జడేజా తనదైన శైలిలో అభిమానులను ఆకట్టుకున్నాడు.
బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటించిన 'దురంధర్' చిత్రంలోని వైరల్ సీన్‌ను జడేజా రీక్రియేట్ చేస్తూ 'ఖమ్మా ఘని.. రాజస్థాన్' అంటూ రాజస్థానీ సంప్రదాయ పద్ధతిలో పలికాడు. ఈ వెల్కమ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటివరకు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కీలక ఆటగాడిగా ఉన్న జడేజా, ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ జెర్సీలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాడు. దీంతో ఐపీఎల్ 2026 సీజన్‌లో అతని ప్రదర్శనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి.



# సన్‌రైజర్స్‌లోనే కాదు.. ఇతర ఫ్రాంచైజీల్లోనూ పాక్ క్రికెటర్లు

ఇంగ్లండ్‌లో జరిగే ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు కొనుగోలు చేయడం చర్చనీయాంశమైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీకి చెందిన ఈ జట్టు అతడిని సుమారు రూ.2.34 కోట్లకు (1,90,000 పౌండ్లు) తీసుకుంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో కొందరు భారత అభిమానులు విమర్శలు చేస్తున్నారు.
జట్టు హెడ్ కోచ్ డేనియల్ వెటోరి మాత్రం ఈ నిర్ణయాన్ని సమర్థించాడు. అబ్రార్ అహ్మద్ బౌలింగ్‌లో వైవిధ్యం ఉందని, స్థానిక ఆటగాళ్లు అతని శైలిని సులభంగా అంచనా వేయలేరని పేర్కొన్నాడు. వేలంలో ఎన్నో ఎంపికలు ఉన్నప్పటికీ అతడినే తీసుకోవాలని నిర్ణయించుకున్నామని తెలిపాడు. ఇదిలా ఉండగా భారత ఫ్రాంచైజీల్లో పాకిస్థాన్ ఆటగాళ్లు ఉండటం ఇదే తొలిసారి కాదు. కేకేఆర్ యాజమాన్యంలోని ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ జట్టు ఉస్మాన్ తారిక్‌ను తీసుకోగా, మేజర్ క్రికెట్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన సీటల్ ఓర్కాస్ జట్టు ఇమాద్ వసీంను కొనుగోలు చేసింది. అలాగే ఐఎల్ టీ20 లీగ్‌లో అబుదాబి జట్టుకు కూడా ఇమాద్ వసీం ప్రాతినిధ్యం వహించాడు. ది హండ్రెడ్ లీగ్‌లో యార్క్‌షైర్ జట్టులో 51 శాతం వాటాను సన్ టీవీ గ్రూప్ కొనుగోలు చేయడంతో నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టు సన్‌రైజర్స్ లీడ్స్‌గా మారింది. ఈ నేపథ్యంలో భారత ఫ్రాంచైజీల్లో పాకిస్థాన్ ఆటగాళ్ల ప్రాతినిధ్యం మళ్లీ చర్చకు వచ్చింది.

## రహానే కెప్టెన్సీకి
# గుడ్‌బై?..

- **వైరల్ పోస్టుపై క్లారిటీ**

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్యా రహానే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. మార్చి 12 తేదీతో ఉన్న ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్టు స్క్రీన్‌షాట్ చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఈ వార్తలో ఎలాంటి నిజం లేదని తేలింది. రహానే తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ లేదా ఎక్స్ ఖాతాల్లో కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు ఎక్కడా ప్రకటించలేదు. అలాగే కేకేఆర్ యాజమాన్యం కూడా దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గతంలో ముంబై డొమెస్టిక్ జట్టు కెప్టెన్సీ నుంచి తప్పుకుంటూ రహానే చేసిన పాత ప్రకటనను ఎడిట్ చేసి కేకేఆర్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు తెలిసింది. 2024లో జట్టును టైటిల్‌కు చేర్చిన శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు వెళ్లిన తర్వాత కేకేఆర్ సారథ్యాన్ని రహానేకు అప్పగించారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కూడా అతడే జట్టును ముందుండి నడిపించనున్నాడు. మార్చి 29న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌తో కేకేఆర్ తన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది.






## బౌలర్‌కు సాయం చేయబోతే రనౌట్..
# షాక్‌లో సల్మాన్ అఘా

బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అఘా విచిత్ర రీతిలో రనౌటయ్యాడు. బౌలర్‌కు బంతి ఇవ్వాలని ప్రయత్నించిన సమయంలోనే బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ అతడిని ఔట్ చేశాడు.
మెహిదీ హసన్ మిరాజ్ వేసిన 39వ ఓవర్లో రిజ్వాన్ బంతిని నేరుగా ఆడగా, దాన్ని కాలితో ఆపేందుకు మిరాజ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న అఘాతో ఢీకొట్టాడు. బంతి తన కాళ్ల వద్ద ఆగడంతో దాన్ని మిరాజ్‌కు ఇవ్వాలని అఘా వంగాడు. అదే సమయంలో అతడు క్రీజు బయట ఉన్నట్లు గమనించిన మిరాజ్ వెంటనే బంతిని తీసుకుని స్టంప్స్‌ను గిరాటేశాడు.
బంగ్లాదేశ్ ఆటగాళ్లు అప్పీల్ చేయగా, రీప్లే పరిశీలించిన టీవీ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. దీంతో 64 పరుగులు చేసిన అఘా నిరాశగా పెవిలియన్ చేరాడు. నాలుగో వికెట్‌కు రిజ్వాన్ (44), అఘా (64)లు నెలకొల్పిన 109 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రిషద్ హొసేన్ (356), మెహిదీ హసన్ మిరాజ్ (234) రాణించడంతో పాకిస్థాన్ 47.3 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది.

# పంత్‌కు సిక్సర్ల కింగ్ స్పెషల్ ట్రైనింగ్

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు టీమిండియా వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో మాజీ ఆల్‌రౌండర్, 'సిక్సర్ల కింగ్'గా పేరొందిన యువరాజ్ సింగ్ మార్గదర్శకత్వంలో పంత్ ప్రాక్టీస్ చేశాడు.
దాదాపు నాలుగు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో పవర్ హిట్టింగ్‌ను మెరుగుపరుచుకోవడంపై పంత్ దృష్టి పెట్టాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా డే అండ్ నైట్ ప్రాక్టీస్ నిర్వహిస్తూ, ఒత్తిడి సమయంలో పరుగులు సాధించే విధానాలపై యువరాజ్ సింగ్ సూచనలు ఇచ్చాడు. శిక్షణ ముగిసిన అనంతరం పంత్ చెన్నైలో జరుగుతున్న లక్నో సూపర్ జెయింట్స్ ప్రీసీజన్ క్యాంపులో చేరాడు. కోచ్‌లు భరత్ అరుణ్, లాన్స్ క్లూజనర్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ శిబిరంలో జట్టు వ్యూహాలపై పంత్ దృష్టి సారిస్తున్నాడు.



## టాప్ 10 ఏసీ చిట్కాలు

గది పరిస్థితులకు అనుగుణంగా కెపాసిటీ ఎంచుకోండి ఎండ ఎక్కువగా పడే గదులు లేదా ఎక్కువ మంది ఉన్న గదులకు ఎక్కువ టన్ ఏసీ అవసరం.



# బ్లాక్ ఎథ్నిక్ లుక్‌లో మెరిసిన సంయుక్త



నటి సంయుక్తా మీనన్ ఇటీవల సోషల్ మీడియాలో మరింత చురుకుగా కనిపిస్తున్నారు. తన రోజువారీ జీవితానికి సంబంధించిన క్షణాలతో పాటు ఫ్యాషన్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటున్నారు. ఆధునిక దుస్తుల నుంచి సంప్రదాయ వేషధారణ వరకు విభిన్న లుక్స్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన కొత్త ఫోటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.
ఈ చిత్రాల్లో సంయుక్తా నలుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించారు. నలుపు రంగు దుస్తులపై బంగారు ఎంబ్రాయిడరీతో చేసిన అద్భుతమైన డిజైన్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుస్తుల బాడీస్ భాగంలో సున్నితమైన బంగారు పనితనం ఉండగా, స్కర్ట్‌పై విస్తృతంగా చేసిన అలంకరణలు ఆ వేషధారణకు రాజసంగా మెరుగు తీసుకొచ్చాయి.
బ్లౌజ్ డిజైన్ కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మెడ భాగం, భుజాల వద్ద నాజూకైన పనితనం కనిపిస్తూ సంప్రదాయ శైలికి నూతన అందాన్ని జోడించింది. అదే సమయంలో కిందకు వాలుతూ ఉన్న స్కర్ట్‌పై ఉన్న బంగారు మోటిఫ్స్ మొత్తం లుక్‌ను మరింత గొప్పగా తీర్చిదిద్దాయి.
గాఢమైన నలుపు రంగు వస్త్రంపై మెరిసే బంగారు పనితనం కలిసిపోవడంతో ఈ ఎథ్నిక్ వేషధారణ ఎంతోఆకట్టుకుంటున్నది.

# బిర్యానీ కోసం వెళ్తే పులిహోర దొరికినట్లు ఉంటుంది..




• ‘డెకాయిట్’పై అడవి శేష్

“ఈ సినిమాను భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా భావించి వస్తే బిర్యానీ కోసం వెళ్తే పులిహోర దొరికినట్లు అనిపించొచ్చు” అని నటుడు అడవి శేష్ అన్నారు. ‘డెకాయిట్’ సినిమా కథను వివరించుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
తాజాగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన శేష్, ఈ సినిమా ఇద్దరు మాజీ ప్రేమికుల మధ్య సాగే కథ అని చెప్పారు. వారి గతంలో జరిగిన విషయాలు చిన్నగా కనిపించినా, తర్వాత జరిగే పరిణామాలే కథను ముందుకు నడిపిస్తాయని తెలిపారు.
అడవి శేష్ సినీ ప్రయాణం చిన్న పాత్రలతో ప్రారంభమైంది. ‘పంజా’ సినిమాలో చేసిన పాత్ర ఆయనకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. తర్వాత ‘బాహుబలి’ చిత్రంలో కూడా చిన్న పాత్రలో కనిపించారు. అనంతరం ‘క్షణం’ చిత్రంతో హీరోగా నిలిచి పెద్ద విజయాన్ని అందుకున్నారు. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. తరువాత హీరోగా చేసిన పలు సినిమాలు విజయవంతం కావడంతో శేష్‌కు మినిమమ్ గ్యారంటీ హీరోగా గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న ‘డెకాయిట్’ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

## విడాకుల తర్వాత
# హన్సిక పోస్ట్ వైరల్

నటి హన్సిక తన భర్త సోహైల్‌తో వివాహ బంధానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగేళ్ల వివాహ జీవితానికి వీరిద్దరూ అధికారికంగా తెరదించారు. విడాకుల తర్వాత హన్సిక సోషల్ మీడియాలో చేసిన తాజా పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఆమె ‘చార్దీ కలా’ అనే పంజాబీ పదాన్ని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఉత్సాహాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలి, ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆశను నిలబెట్టుకోవాలి అనే భావాన్ని ఈ పదం సూచిస్తుంది. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొనే సందేశాన్ని హన్సిక ఈ పోస్ట్ ద్వారా వెల్లడించినట్లు అభిమానులు భావిస్తున్నారు. హన్సిక, సోహైల్ వివాహం 2022 డిసెంబర్‌లో ఘనంగా జరిగింది. రాజస్థాన్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుకను ‘లవ్ షాదీ డ్రామా’ అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్ రూపంలో కూడా విడుదల చేశారు. గత సంవత్సరం ఆగస్టులో హన్సిక తన సోషల్ మీడియా ఖాతాల నుంచి పెళ్లికి సంబంధించిన ఫోటోలను తొలగించడంతో విడాకులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ వార్తలు నిజమవుతూ మార్చి 11న కోర్టు వీరిద్దరికీ అధికారికంగా విడాకులు మంజూరు చేసింది.





# బ్యాంకాక్‌లో బోల్డ్ లుక్‌తో ఆకట్టుకున్న సిమ్రాన్ కౌర్

బాలీవుడ్‌లో గ్లామర్ బ్యూటీగా గుర్తింపు పొందుతున్న నటి సిమ్రాన్ కౌర్ మరోసారి తన హాట్ ఫోటోలతో సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. మోడలింగ్ రంగం నుంచి సినీ ప్రపంచంలోకి వచ్చిన ఈ నటి ఇప్పటివరకు కొద్దిపాటి చిత్రాల్లో మాత్రమే కనిపించింది. అయినా సోషల్ మీడియాలో మాత్రం మంచి క్రేజ్ సంపాదించుకుంది.
సిమ్రాన్ తరచూ తన స్టైలిష్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఆధునిక దుస్తుల్లో చేసిన ఫోటోషూట్లు నెటిజన్లను ఆకట్టుకుంటుంటాయి. తాజాగా బ్యాంకాక్‌లో ఉన్న సమయంలో తీసుకున్న కొన్ని ఫోటోలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ చిత్రాలు ప్రస్తుతం నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.
ఈ ఫోటోలలో సిమ్రాన్ స్విమ్మింగ్ పూల్ దగ్గర స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో కనిపించింది. టూ పీస్ దుస్తుల్లో జ్యూస్ గ్లాస్ పట్టుకుని ఇచ్చిన పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరో ఫోటోలో పొట్టి నిక్కర్‌తో తెలుపు రంగు షర్ట్ ధరించింది. షర్ట్ బటన్లు విప్పి స్టైలిష్‌గా పోజులు ఇచ్చింది. తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు క్యూట్, వావ్, లవ్లీ అంటూ కామెంట్లు పెడుతున్నారు

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com